


ఎన్నికల హామీల అమలుతో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోంది. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో పోలవరం, అమరావతి, రైల్వేలు, జాతీయ రహదారుల ప్రాజెక్టులతో రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతోంది.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**



సోమవారం 06.07.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 75 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00




# ప్రపంచం నలుమూలలా... ఏపీ జెండా!

- ప్రవాసాంధ్రులే రాష్ట్రానికి నిజమైన బ్రాండ్ అంబాసిడర్లన్న లోకేష్
- కియా తర్వాత మరిన్ని కొరియా పెట్టుబడులే లక్ష్యం
- భారత్‌లో కొరియాకు నమ్మకమైన భాగస్వామి ఆంధ్రప్రదేశ్

2లో

**సియోల్ (సౌత్ కొరియా):** ఇక్కడ మీలో ఉన్న ప్రతిఒక్కరూ ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ అంబాసిడర్లే. మీరు విజయాన్ని సాధించినప్పుడు, వ్యాపారం ప్రారంభించినప్పుడు, మంచి పేరును సంపాదించినప్పుడల్లా ఆంధ్రప్రదేశ్ గర్వపడుతుంది. మీరు వెళ్ళే ప్రతీచోట ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి గాథను చెప్పాలన్నది నా ఆకాంక్ష అని ఏపీ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. సియోల్‌లో తెలుగు డయాస్పోరా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... మన రాష్ట్రంలో ఉన్న అవకాశాలను వివరించండి, వేగవంతమైన అనుమతులు, పారదర్శక పాలనను తెలియజేయండి. ఏపీలో పెట్టుబడులు పెట్టాలని కోరండి. ఒకసారి మనరాష్ట్రాన్ని చూసినవారు... వెంటనే మన ప్రాంతాన్ని ఎంపిక చేసుకుంటారు. ఏ రంగంలోనైనా కలిసి పనిచేయడానికి ఆంధ్రప్రదేశ్ సిద్ధంగా ఉంది. మేం నిజాయితీతో ప్రతి పెట్టుబడిదారుడికీ స్వాగతం పలుకుతాం. ప్రతి ఆవిష్కర్త కంపెనీని మేం ఆదరిస్తాం. భారతదేశంతో కలిసి పనిచేసే ఆసక్తి ఉన్న ప్రతీ వ్యక్తికీ మేము స్వాగతం పలుకుతాం.



## కొరియా నుంచి... చిప్ బాట

- ఎలక్ట్రానిక్స్ దిగ్గజాలకు ఆంధ్రప్రదేశ్ రెడ్ కార్పెట్
- శ్రీసిటీలో 'కొరియా ఎన్‌క్లేవ్'కు రాష్ట్రం సిద్ధం
- పెట్టుబడులు, నైపుణ్య భాగస్వామ్యంపై లోకేష్ ప్రతిపాదనలు


2 లో



# బంగారు కుటుంబాలే లక్ష్యం

- ధనిక-పేద మధ్య అంతరాలు తగ్గించడమే ప్రభుత్వ సంకల్పమన్న చంద్రబాబు
- పీ4తో జీరో పావర్టీ దిశగా అడుగులు
- కుప్పంలో మార్గదర్శులతో సీఎం సమావేశం

కుప్పం (జర్నలిస్ట్ ఫైల్) : పేదరిక నిర్మూలనకు ప్రజల భాగస్వామ్యంతో కూడిన శాశ్వత పరిష్కారంగా పీ4 (పబ్లిక్-ప్రైవేట్-పీపుల్ పార్ట్‌నర్‌షిప్ ఫర్ ప్రాస్పెరిటీ) కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. పేదల జీవితాలు బంగారు మయం కావాలనే ఉద్దేశ్యంతోనే పీ4 ద్వారా బంగారు కుటుంబాలు-మార్గదర్శుల విధానాన్ని అవలంభిస్తున్నామని చెప్పారు. కుప్పం పర్యటనలో భాగంగా ఆదివారం పీ4 మార్గదర్శులు, మిగతా 2లో...



# రైతు గడపకు మార్కెట్

- కుప్పం క్లస్టర్ల పంటలకు మెట్రో నగరాల్లో మార్కెటింగ్
- ప్రకృతి వ్యవసాయం, విలువ జోడింపుపై ప్రత్యేక దృష్టి
- రైతుల ఆదాయం పెంచేలా ప్రభుత్వ కార్యాచరణ

2 లో

# 2027పై కమలం ధీమా



- ఉత్తర్‌ప్రదేశ్‌లో మరోసారి ఎన్డీయే ప్రభుత్వమేనన్న నితిన్ నబిన్
- మోదీ-యోగి నాయకత్వంపై విశ్వాసం వ్యక్తం
- ఎన్నికల రోడ్‌మ్యాప్‌పై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం

లఖ్‌నవూ (జర్నలిస్ట్ ఫైల్) : ఉత్తర్‌ప్రదేశ్ రాజకీయాలు 2027 అసెంబ్లీ ఎన్నికల దిశగా వేడెక్కుతున్నాయి. వచ్చే ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నేతృత్వంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ అఖండ విజయాన్ని నమోదు చేయబోతోందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని డబుల్ ఇంజిన్ సర్కార్ అందిస్తున్న సేవా భావమే కూటమిని మళ్లీ అధికారంలోకి తీసుకువస్తుందని ఆయన స్పష్టం చేశారు.

ఉత్తర్‌ప్రదేశ్‌లో రెండు రోజుల సంస్థాగత పర్యటనలో ఉన్న నితిన్ నబిన్, మిగతా 2లో...

## స్థానికంగానే స్కాన్లు.. శస్త్రచికిత్సలు

- సెకండరీ ఆసుపత్రులకు ఆధునిక హంగులు
- రెండేళ్లలో రూ.72.81 కోట్లతో కొత్త పరికరాలు
- అన్ని ఆసుపత్రుల్లో టెలీ రేడియాలజీ సేవలకు చర్యలు
- 4 జిల్లా ఆసుపత్రులకు త్వరలో సీటీ స్కాన్లు
- బేబీ వార్మర్లు, ఫీటల్ డాప్లర్లు, ఇతర సౌకర్యాల కల్పన

అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : రోగ నిర్ధారణ నుంచి శస్త్రచికిత్స వరకు స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు అందేలా రాష్ట్రంలోని సెకండరీ ఆసుపత్రులను కూటమి ప్రభుత్వం బలోపేతం చేస్తోంది. జిల్లా, ప్రాంతీయ, సామాజిక, మాతా శిశు సంరక్షణ ఆసుపత్రులకు ఆధునిక పరికరాలు, యంత్రాలను సమకూరుస్తోంది. మిగతా 3లో...

రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ వెల్లడి



# నేడు వంశధార నీటి విడుదల

- మంత్రి అచ్చెన్నాయుడు తీపి కబురు
- ఖరీఫ్ సాగుకు సర్వం సిద్ధం



శ్రీకాకుళం(జర్నలిస్ట్ ఫైల్) : జిల్లా రైతాంగానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీపి కబురు అందించారు. ఖరీఫ్ సాగు అవసరాల నిమిత్తం సోమవారం ఉదయం వంశధార ప్రధాన కాలువ ద్వారా సాగునీటిని విడుదల చేసేందుకు యంత్రాంగం మిగతా 2లో...



# అసంపూర్తి వంతెనలకు మోక్షం

- పెండింగ్ నిర్మాణాల పూర్తి కోసం రూ.90.20 కోట్ల మంజూరు
- 13 నియోజకవర్గాల్లో పనులు వేగవంతం
- త్వరలో ప్రజల రాకపోకలకు అందుబాటులోకి వంతెనలు

అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్రంలో సుదీర్ఘకాలంగా అసంపూర్తిగా నిలిచిపోయిన 14 వంతెనల నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు రూ. 90. 20 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ప్రత్యేక చొరవతో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు వెల్లడించారు.

మంత్రి తెలిపిన వివరాల ప్రకారం, రూ. 90. 20 కోట్లతో రాష్ట్రంలోని 9 జిల్లాల పరిధిలోని 13 నియోజకవర్గాల్లో ఉన్న 14 అసంపూర్తి వంతెనల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. వీటిలో 12 జిల్లా ప్రధాన రహదారుల (ఎండీఆర్) పరిధిలో, రెండు రాష్ట్ర రహదారుల (ఎస్‌హెచ్) పరిధిలో ఉన్నాయి. అనకాపల్లి, కాకినాడ, ఏలూరు, పశ్చిమగోదావరి, కృష్ణా, ప్రకాశం, తిరుపతి, కడప, ఎన్టీఆర్ జిల్లాల్లో ఈ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. మిగతా 2లో...

# యువతకు ఉద్యోగ అవకాశాలు..




- హైదరాబాద్‌లో మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో జాబ్ మేళా, ప్రజా దర్బార్
- ఏపీ ప్రజల సమస్యలపై నేరుగా వినతుల స్వీకరణ
- ప్రతి అర్జీకి త్వరితగతిన పరిష్కారం
- ఎక్కడున్నా ప్రజలకు ప్రభుత్వం అండ

అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించే లక్ష్యంతో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని బిక్షపతి యాదవ్ కళ్యాణ మండపంలో జాబ్ మేళా మరియు ప్రజా దర్బార్ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. మిగతా 2లో...

# మత్స్యకారుల రక్షణకు ముమ్మర చర్యలు

- గల్లంతైన ఏడుగురు మత్స్యకారుల్లో ఒకరిని సురక్షితంగా రక్షించాం
- ఒడిశా తీరంలో చిక్కుకున్న విశాఖకు చెందిన 10 మంది మత్స్యకారులు సురక్షితం
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : విశాఖపట్నం నుంచి వేటకు వెళ్లి గల్లంతైన ఏడుగురు మత్స్యకారుల కోసం ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చేపట్టిన సహాయక చర్యల్లో భాగంగా ఒక మత్స్యకారుడిని సురక్షితంగా రక్షించినట్లు రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. జూలై 5వ తేదీ ఉదయం సుమారు 7:30 గంటల సమయంలో సముద్రంలో ప్రయాణిస్తున్న ఎంవీ యూనివర్స్ వెల్తీ మర్చంట్ నౌక సిబ్బంది సముద్రంలో కొట్టుకుపోతున్న మత్స్యకారులను గుర్తించారు. వెంటనే నౌక కెప్టెన్ అత్యవసర సహాయక చర్యలు ప్రారంభించి, లైఫ్ రింగులు, తాళ్ల సహాయంతో ఒక మత్స్యకారుడిని ఉదయం 7:50 గంటల ప్రాంతంలో సురక్షితంగా రక్షించారు. అయితే ఆ సమయంలో గంటకు బలమైన గాలులు, సుమారు మూడు మీటర్ల ఎత్తులో అలలు ఉండటంతో పాటు సముద్రం అత్యంత అల్లకల్లోలంగా ఉండడం వల్ల మిగిలిన మత్స్యకారులు కనిపించకుండా పోయారని నౌక కెప్టెన్ సమాచారం అందించినట్లు మంత్రి తెలిపారు. తీవ్ర ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా రెస్క్యూ బోటును సముద్రంలోకి దించడం కూడా సాధ్యపడలేదని వివరించారు. కాకినాడ నుంచి ప్రత్యేక నౌక తెప్పించి హెలికాప్టర్లతో కూడా గాలింపు చేసామని వెల్లడించారు. ప్రస్తుతం మిగిలిన ఆరుగురు మత్స్యకారుల కోసం భారత కోస్ట్ గార్డ్, నేవీ, మెరైన్ పోలీస్, మిగతా 2లో...

# ముంబయిని ముంచెత్తిన వాన

- భారీ వర్షాలు, ఈదురుగాలులతో విమానాశ్రయం స్తంభింపు
- నాలుగు విమానాలు రద్దు
- 13 విమానాల దారి మళ్లింపు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- రెడ్ అలర్ట్‌తో అప్రమత్తమైన యంత్రాంగం
- అంబానీ కాన్వాయ్ ముందే కూలిన భారీ చెట్టు
- తృటిలో తప్పిన ప్రమాదం



ముంబాయి(జర్నలిస్ట్ ఫైల్) : ముంబయిని భారీ వర్షాలు, ఈదురుగాలులు అతలాకుతలం చేస్తున్నాయి. దీనితో ఆదివారం ఇండిగోకు చెందిన నాలుగు విమానాలు రద్దు కాగా, వివిధ సంస్థలకు చెందిన 13 ల్యాండింగ్ విమానాలను సమీపంలోని విమానాశ్రయాలకు దారి మళ్లించామని, అవి సురక్షితంగా ముంబయిలోనే ల్యాండ్ అయ్యాయని అధికారిక వర్గాలు తెలిపాయి.

భారీ వర్షాలు, ఈదురు గాలుల వల్ల ముంబయి అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బయలుదేరాల్సిన 90 శాతం విమానాలు గంటకు పైగా ఆలస్యంగా నడుస్తున్నాయి. రావాల్సిన విమానాల్లో 45 శాతం ఆలస్యంగా నడుస్తున్నాయి. దీనితో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదానీ గ్రూప్, ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) సంయుక్తంగా ముంబయి అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో సదరు ఎయిర్‌పోర్టు అధికారులు ఇవాళ ఒక ప్రకటన విడుదల చేశారు. "ఉదయం సుమారు 10. 17 గంటల సమయంలో గంటకు 42 నాట్స్ వేగంతో వీచిన బలమైన గాలులు, భారీ వర్షం కారణంగా విజిబిలిటీ తగ్గింది. ఈ ప్రతికూల వాతావరణ పరిస్థితుల మిగతా 3లో...

# కొరియా నుంచి... చిప్ బాట



**సియోల్ (సౌత్ కొరియా):** ఏపీ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్‌తో సియోల్‌లో దక్షిణ కొరియా భారత రాయబారి గౌరంగలాల్ దాస్ మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... శాంసంగ్, ఎల్‌జీ, ఎస్‌కె, ఏఎస్‌ఐపీ-ఏపీఏసీటీ ఓశాట్‌ల ఆధారంగా, ఇండియా సెమీకండక్టర్ మిషన్, ఏపీ ఎలక్ట్రానిక్స్ పాలసీ 4.0కు అనుగుణంగా కొరియన్ ఎలక్ట్రానిక్స్ కంపెనీలు, చిప్ దిగ్గజాలను ఏపీకి రప్పించేందుకు సహకారం అందించాలని కోరారు. ఏపీలో శ్రీసిటీ, నాయుడుపేట, కొప్పర్తి, విశాఖపట్నంలలో రెడీ టు యూజ్ క్లస్టర్లు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఐఐటీ తిరుపతి, ఐఐఐటీ శ్రీసిటీ, ఆంధ్ర విశ్వవిద్యాలయాలతో కలిసి కొరియా-అనుసంధాన నైపుణ్య కార్యక్రమాలకు (VLSI, ATMP/ప్యాకేజింగ్, SMT, డిస్‌ప్లేలు) సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కొరియా అధ్యక్షుడు లీ జే-మ్యుంగ్ ఏప్రిల్ 2026లో భారత్ పర్యటన సందర్భంగా "కొరియా ఎన్‌క్లేవ్" ఏర్పాటు కోసం చేసిన ప్రతిపాదనకు కార్యరూపం ఇచ్చేందుకు.. కొరియన్ చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎస్ఎంఈలు) కోసం ఉద్దేశించిన ఒక ప్లగ్-అండ్-ప్లే టౌన్‌షిప్ కు శ్రీసిటీలో ఆతిథ్యం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని లోకేష్ తెలిపారు. కొరియా ప్రాధాన్యతారంగ పరిశ్రమలను ఏపీకి తీసుకొచ్చేందుకు చొరవ చూపాలని కోరారు. అనంతపురంలో కియా/హ్యుందాయ్ మోబిస్ ఆటో-ఈవీ క్లస్టర్‌ను విస్తరించడంపై చర్చించారు. ఆంధ్రప్రదేశ్ తీరంలో హెచ్‌డి హ్యుందాయ్ తరహా గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్‌ను ఏర్పాటు, బ్యాటరీ/గ్రీన్-హైడ్రోజన్ ప్రాజెక్టుల ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలించాల్సిందిగా సూచించారు. ఏపీ --కొరియా మధ్య సంబంధాల బలోపేతానికి సహకారం అందించాలని కోరారు. కొరియా ప్లస్, ఖూ=ూ, భారత్-కొరియా పారిశ్రామిక సహకార కమిటీలను అనుసంధానిస్తూ ఒక ప్రత్యేక ఏపీ--కొరియా డెస్క్ ఏర్పాటుచేస్తామని తెలిపారు. ఈనెల 10న నిర్వహించే సియోల్ ఇన్వెస్టర్ రోడ్‌షో, +2+ అవగాహన ఒప్పందాల వైపు మళ్లించేలా చొరవ చూపాల్సిందిగా మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు.

# 2027పై కమలం ధీమా



(మొదటి పేజీ తరువాయి)

లఖ్‌నవూలో పార్టీ పదాధికారులు, ఎన్డీయే కూటమి భాగస్వామ్య పక్షాలతో కీలక సమావేశం నిర్వహించారు. రాబోయే ఎన్నికల వ్యూహాలు, రోడ్‌మ్యాప్‌పై ఈ సందర్భంగా ఆయన దిశానిర్దేశం చేశారు.

అనంతరం మీడియాతో మాట్లాడిన నితిన్ నబిన్, బీజేపీ ఎల్లప్పుడూ ఎన్నికల బరిలో ముందుంటుందని పేర్కొన్నారు. 'ఉత్తర్‌ప్రదేశ్‌ను ఒక అద్భుతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ఎన్డీయే కూటమిలోని అన్ని పార్టీలు కలిసికట్టుగా శ్రమించాయి. ప్రధాని మోదీ, సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రజల కోసం అందించిన నిరంతర సేవలు, సంక్షేమ పథకాలు మాపై నమ్మకాన్ని పెంచాయి. 2027 ఎన్నికల్లో మేము భారీ మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయం' అని ఆయన వ్యాఖ్యానించారు.

యూపీ ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య ప్రతిపక్ష సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ)పై ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఉత్తర్‌ప్రదేశ్ ప్రజలు గుండాయిజం, వంశపారంపర్య రాజకీయాలను తిరస్కరించి, అభివృద్ధిని కోరుకుంటున్నారని అన్నారు. 'వికసిత్ భారత్' లక్ష్యంతో ముందుకు సాగుతున్న తరుణంలో, రాబోయే 21 ఏళ్ల పాటు సమాజ్‌వాదీ పార్టీ అధికారానికి దరిదాపుల్లో కూడా కనిపించదని మౌర్య జోస్యం చెప్పారు. పార్టీ నాయకత్వం, ప్రభుత్వం, సంస్థాగత యంత్రాంగం అంతా కలిసికట్టుగా 2017 నాటి చరిత్రాత్మక విజయాన్ని 2027లో పునరావృతం చేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ఎస్పీ నేతలు సమాజాన్ని కులం, భాష, ప్రాంతాల వారీగా విభజించి దేశాన్ని బలహీనపరచాలని చూస్తున్నారని, వారిది పూర్తిగా ప్రతికూల అజెండా అని యూపీ మంత్రి భూపేంద్ర చౌదరి మండిపడ్డారు. నితిన్ నబిన్ పర్యటనతో ఉత్తర్‌ప్రదేశ్ బీజేపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. రాబోయే ఎన్నికల్లో ఎలాగైనా సరే క్లీన్‌స్వీప్ చేయాలనే పట్టుదలతో ఎన్డీయే కూటమి ఇప్పటినుంచే క్షేత్రస్థాయి వ్యూహాలకు పదును పెడుతోంది.

# నేడు వంశధార నీటి విడుదల



(మొదటి పేజీ తరువాయి)

సర్వం సిద్ధం చేసింది. ఆదివారం ఉదయం ఈ మేరకు మంత్రి జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తో ఫోన్లో మాట్లాడారు. సాగునీటి విడుదలపై తగు సూచనలు చేశారు. మంత్రి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమానికి ముహూర్తం ఖరారైంది. వంశధార ప్రాజెక్టు కమిటీ చైర్మన్ అరవల రవీంద్ర, ఇరిగేషన్ ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయం చేసుకుంటూ.. రేపు నీటిని విడుదల చేయనున్నారు. కేవలం పైప్రాంతాలకే కాకుండా జిల్లాలోని చివరి (శివారు) ఆయకట్టు భూములకు సైతం సక్రమంగా, సమృద్ధిగా నీరందించడమే లక్ష్యంగా నీటి వృధాను అరికడుతూ ప్రతీ ఎకరానికి సాగునీరు చేర్చేలా పక్కా ప్రణాళికతో అధికారులు ముందుకు సాగుతున్నారు. కూటం ప్రభుత్వం అధికారులకు వచ్చిన నాటి నుంచి వంశధార కాలువ ద్వారా సుదూరంలో ఉన్న శివారు కాలువలైన పలాస వం-కు నీటిని అందించే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఈసారి కూడా ప్రభుత్వ సంకల్పాన్ని నెరవేరుస్తామని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# అసంపూర్తి వంతెనలకు మోక్షం



(మొదటి పేజీ తరువాయి)

ఈ 14 వంతెనల్లో 11 చోట్ల గతంలో వంతెనల నిర్మాణం పూర్తయినప్పటికీ అప్రోచ్ రోడ్లు లేక వినియోగంలోకి రాలేదని, మరో మూడు చోట్ల వంతెనలతో పాటు అప్రోచ్ రోడ్ల నిర్మాణం కూడా చేపట్టాల్సి ఉందన్నారు. భూసేకరణలో జాప్యం, నాబార్డు వంటి పథకాల గడువు ముగియడం తదితర కారణాలతో ఈ ప్రాజెక్టులు మధ్యలో నిలిచిపోయాయని వివరించారు.

రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిరుపయోగంగా ఉన్న ఈ వంతెనలను పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తెలిపారు. పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజల రాకపోకలకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని పేర్కొన్నారు.

# ప్రపంచం నలుమూలలా... ఏపీ జెండా!

(మొదటి పేజీ తరువాయి)

**ఎన్ఆర్ఐల ప్రతి విజయం దేశానికి గర్వకారణం :** ప్రపంచంలో తెలుగు ప్రజలు లేని దేశం లేదు. ఏ దేశంలో, ఏ ప్రాంతానికి వెళ్లినా అక్కడ తెలుగు ప్రజల ఉనికి ఉంటుంది. నేను ఎక్కడికెళ్లినా నా పరిచయాలు తెలుగు సమాజంతోనే మొదలవుతాయి. విదేశాల్లో ఉంటున్న తెలుగువారికి తమ దేశం, సంస్కృతిపై అపారమైన ప్రేమ. వారు ఎంత దూరంలో ఉన్నా భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబిస్తారు. దక్షిణ కొరియాలోని భారతీయ సమాజానికి నా హృదయపూర్వక అభినందనలు. ఎంబసీ అధికారులు, నిర్వాహకులు, ఈ వేదిక ఏర్పాటుచేసిన ప్రతీ ఒక్కరికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. దేశం నుంచి దూరంగా ఉన్న ప్రతీ భారతీయుడినీ కలిసిన ప్రతిసారీ నాకు ఒకింత గర్వంగా ఉంటుంది. మీ కష్టపడేతత్వం, నైపుణ్యం, సంకల్పం ద్వారా మీరు భారత్‌కు గౌరవాన్నిఇనుమడింపజేస్తున్నారు. మీ ప్రతి విజయం భారతదేశ ప్రతిష్టను పెంచుతుంది.

**దక్షిణకొరియా విజయగాథ మనకు ప్రేరణ :** దక్షిణ కొరియా అభివృద్ధి ప్రయాణం ఆదర్శనీయం. దక్షిణ కొరియా ఇప్పుడు ఝుఎంబఅస్త్ర, ఎబఅఝుఅ, LG, Kia వంటి ప్రఖ్యాత కంపెనీలను ప్రపంచవ్యాప్తంగా తన సత్తా చాటుతున్నాయి. సంపద కేవలం ప్రకృతి వనరుల ఆధారంగా రాదని.. శ్రమ, ఆవిష్కరణ, శాస్త్రీయ దృక్పథం, తపన ద్వారానే దేశాలు అభివృద్ధిపథంలో ముందుంటాయని దక్షిణ కొరియా నిరూపించింది. దక్షిణ కొరియా విజయగాథ మనకు, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌కి పెద్ద ప్రేరణ. భారత్ – దక్షిణ కొరియా మధ్య సంబంధం కేవలం వాణిజ్యం మాత్రమే కాదు. మన భాగస్వామ్యం ప్రజాస్వామ్య విలువలు, పరస్పర విశ్వాసం, ఆవిష్కరణ,



యువతపై పెట్టుబడి అనే పటిష్ట మూలాలపై ఆధారపడి ఉంది. గతకొన్నిసంవత్సరాల్లో ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్, సెమీ కండక్టర్లు, షిప్ బిల్డింగ్, గ్రీన్ ఎనర్జీ, అడ్వాన్స్ డ్ మ్యానుఫ్యాక్చరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఉన్నత విద్య వంటి రంగాల్లో రెండు దేశాలు కలిసి మంచి ఫలితాలను సాధించాయి.

**కియాతో ఆటో మొబైల్ ఎకోసిస్టమ్ అభివృద్ధి :** కియా విజయగాథ మనకు ఆదర్శం. కియా తమ మొదటి ఇన్-ఇండియా ఫ్యాక్టరీని ఏర్పాటు చేయడానికి స్థలాలు అన్వేషిస్తున్నపుడు ఆంధ్రప్రదేశ్ తక్షణ నిర్ణయం తీసుకొని, పారదర్శకత, వేగవంతమైన అనుమతులు, భూమి, మౌలిక సదుపాయాలను సమకూర్చి నిజమైన భాగస్వామిగా నిలిచింది. ఫలితంగా ఆవిష్కృతమైందే కియా ప్లాంట్. కేవలం కార్ల తయారీ కేంద్రంగానే కాకుండా, ఒక పూర్తిస్థాయి ఆటోమొబైల్ ఎకోసిస్టమ్‌గా మారి, వేలాదిమందికి ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు కల్పించింది. మన ఈ ప్రయాణాన్ని మరిన్ని సక్సెస్ స్టోరీలుగా మార్చాలి. ఐటీ, సెమికండక్టర్లు, మొబిలిటీ, బ్యాటరీ టెక్నాలజీలు, గ్రీన్ హైడ్రోజన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అడ్వాన్స్ డ్ మ్యానుఫ్యాక్చరింగ్ – ఏ రంగంలోనైనా ఆంధ్రప్రదేశ్ దక్షిణ కొరియాకు భారతదేశంలో అత్యంత నమ్మకమైన భాగస్వామి కావడానికి సిద్ధంగా ఉంది. వచ్చే దశాబ్దం ఏపీ కేంద్రంగా భారత్-దక్షిణ కొరియా సంబంధాలు మరింత బలపడతాయని నేను విశ్వసిస్తున్నాను. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌తో కొత్త భాగస్వామ్యాలు వికసిస్తాయి.

**యువతకు కొత్త అవకాశాలు కల్పిస్తున్నాం :** ఈరోజు ఆంధ్రప్రదేశ్ ఒక కొత్త అభివృద్ధి దశలోకి ప్రవేశించింది. మా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి దార్శనిక నాయకత్వంలో మేం పెట్టుబడిదారుల నమ్మకాన్ని తిరిగి పొంది, యువతకు కొత్త అవకాశాలను కల్పిస్తున్నాం. ప్రపంచ పెట్టుబడిదారులు ఇటీవల చూస్తున్న వేగంగా నిర్ణయాలు తీసుకోవడం (స్పీడ్), పాలనా స్థిరత్వం (స్టెబిలిటీ), పెట్టుబడి తర్వాత నాణ్యమైన సేవ (సర్వీస్)లు మన రాష్ట్రంలో ఉన్నాయి. ఏపీ అనుసరిస్తున్న 3S (Speed, Stability, Service) మోడల్ తో ఆంధ్రప్రదేశ్ భారతదేశంలో పెట్టుబడిదారులకు నమ్మకమైన ప్రాంతంగా మారింది. మేం అనుసరిస్తున్న ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాల వల్లే ఇది సాధ్యమైంది.

**పరిశ్రమ అవసరాల మేరకు విద్యావ్యవస్థలో మార్పులు :** ప్రతి సంవత్సరం లక్షలాది యువత ఉద్యోగ ప్రపంచంలోకి అడుగుపెడుతున్నారు. వారికి అర్హతల ఆధారంగా నైపుణ్యాలు, అవకాశాలు ఇచ్చే బాధ్యత ప్రభుత్వంగా మాపై ఉంది. ఇందుకోసం మేము విద్యా వ్యవస్థను సమగ్రంగా పునఃరూపకల్పన చేసుకుంటున్నాం. మా పాఠ్యాంశాలను అధునాతన పరిశ్రమ క్లస్టర్ల ఆధారంగా రూపొందిస్తున్నాం. దీనివల్ల విద్యార్థులు పరిశ్రమల అవసరాల మేరకు సిద్ధం కావడంతో పాటు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలు, ప్రాక్టికల్ అనుభవం పొందుతారు. మన విద్యార్థులు గ్లోబల్ స్థాయి ఉద్యోగాల కోసం సన్నద్ధమవ్వాలి. సియోల్, టోక్యో, బెర్లిన్, సిలికాన్ వ్యాలీ ఎక్కడైనా పోటీ పడగలగాలి. అంతర్జాతీయ భాషలను ప్రోత్సహించడం ద్వారా వారి అవకాశాలను మద్దతుగా నిలుస్తున్నాం.

**బలమైన రాష్ట్రాలే బలమైన దేశాన్ని నిర్మిస్తాయి :** తెలుగుదేశం పార్టీ ఆంధ్రప్రదేశ్‌లో బలమైన పునాది కలిగి ఉంది. కానీ మన దృష్టి ఎప్పుడూ జాతీయస్థాయిలో ఉంది. బలమైన రాష్ట్రాలే బలమైన భారత్ ని నిర్మిస్తుందని మేము బలంగా నమ్ముతాం. ప్రాంతీయ ఆకాంక్షలు, జాతీయ అభివృద్ధి ప్రణాళికలు కలిసి ముందుకు సాగితేనే విజయం సాధిస్తామన్నది మా నమ్మకం. మీరు వేల కిలోమీటర్ల దాటి ఇక్కడకు వచ్చినా ఆంధ్రప్రదేశ్ నుంచి మీరు ఎప్పుడూ దూరంగా లేరు. APNRT ద్వారా మేము ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు కుటుంబాలకు మద్దతుగా ఉంటూ, విద్యార్థులు, కార్మికులకు అత్యవసర సాయం, సేవలు అందిస్తూనే ఉంటాం. గ్లోబల్ కమ్యూనిటీకి మద్దతుగా నిలుస్తూ ఆంధ్రప్రదేశ్ మీ వెంటే ఉంటుంది. కొరియా ఒక అద్భుత దేశంగా రూపుదిద్దుకుంది. భారత్ అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ అవకాశాలతో నిండిన భవిష్యత్తును నిర్మిస్తోంది. మనం కలిసికట్టుగా ఆ యజ్ఞంలో భాగస్వాములం అవుదాం. మరిన్ని పెట్టుబడులను ఆకర్షిద్దాం, ఎక్కువ ఉద్యోగాలను సృష్టిద్దాం, అధునాతన విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేద్దాం, మరిన్ని ఆవిష్కరణలను ప్రోత్సహిద్దాం. ఆంధ్రప్రదేశ్‌ను జీవించడానికి, పనిచేయడానికి, పెట్టుబడి పెట్టడానికి అత్యుత్తమ ప్రదేశంగా మార్చుదాం. కలిసికట్టుగా బలమైన ఆంధ్రప్రదేశ్, బలమైన భారత్ ను నిర్మిద్దాం– అని మంత్రి లోకేష్ పిలుపునిచ్చారు.

# బంగారు కుటుంబాలే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

బంగారు కుటుంబాలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. బంగారు కుటుంబాల ఆర్థిక, సామాజిక అభ్యున్నతే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ సమావేశానికి బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్న మెగా, అదానీ, టీవీఎస్ మోటార్ సైకిల్స్ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. బంగారు కుటుంబాలు కేవలం ప్రభుత్వ సహాయంపై ఆధారపడే పరిస్థితిలో కాకుండా, ఆర్థికంగా ఎదిగి ఇతరులకు సైతం చేయూతనిచ్చే స్థాయికి చేరుకోవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఇందుకోసం బంగారు మిత్రల సహకారంతో ప్రతి కుటుంబం స్థితిగతులను ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తూ, వారి అవసరాలకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. పీ4 కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో జీరో పావర్టీ లక్ష్యాన్ని సాధించేందుకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందని చంద్రబాబు తెలిపారు. దీనిని ఎంబీకే-10:20 నమూనాగా అమలు చేస్తున్నామని, సమాజంలో ఉన్నత స్థాయిలో ఉన్న 10 శాతం మంది ప్రజలు పేదరికంలో ఉన్న 20 శాతం కుటుంబాలకు అండగా నిలవాలనే ఆలోచనతో ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు వివరించారు.




**సమాజంపై నమ్మకాన్ని పెంపొందిస్తోన్న మార్గదర్శులు :** రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 12 లక్షల బంగారు కుటుంబాలను గుర్తించినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. వీరికి అండగా నిలిచేందుకు ఇప్పటివరకు 1.10 లక్షల మంది మార్గదర్శులు ముందుకు రావడం పీ4 కార్యక్రమంపై సమాజంలో ఏర్పడిన విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. డబ్బులు ఇచ్చి వెళ్లిపోవడం మాత్రమే ఈ కార్యక్రమం ఉద్దేశం కాదని, కుటుంబాల జీవన ప్రమాణాలను శాశ్వతంగా మెరుగుపరిచేలా మార్గనిర్దేశం చేయడమే అసలు లక్ష్యమని స్పష్టం చేశారు. కుప్పం నియోజకవర్గంలో 9 వేల బంగారు కుటుంబాలను అభివృద్ధి చేసే బాధ్యతను అదానీ, టీవీఎస్, మెగా సంస్థలకు అప్పగించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఈ కుటుంబాల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, వారి జీవితాల్లో స్పష్టమైన మార్పు తీసుకురావడానికి సంస్థలు, మార్గదర్శులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పీ4 కార్యక్రమం ద్వారా జీవన ప్రమాణాలు మెరుగుపర్చుకున్న బంగారు కుటుంబాల విజయగాథలను రాష్ట్ర ప్రజలందరికీ చేరేలా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి తెలిపారు. ఇలాంటి విజయాలు మరెంతో మందికి స్ఫూర్తినిస్తాయని చెప్పారు. అలాగే తమ జీవితాల్లో మార్పు తీసుకొచ్చేందుకు ముందుకొచ్చిన మార్గదర్శుల పట్ల బంగారు కుటుంబాలు కృతజ్ఞతాభావంతో ఉండాలని సూచించారు. అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికి చేరాలంటే ఆదాయాలు పెరగాలని, ఆర్థిక అసమానతలు తగ్గి ప్రతి కుటుంబం మెరుగైన జీవన ప్రమాణాలు సాధించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. రాష్ట్రంలో పీ4 కార్యక్రమాన్ని దేశానికే ఆదర్శంగా నిలిచే నమూనాగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్, చిత్తూరు జిల్లా ప్రజా ప్రతినిధులు, కుప్పం స్థానిక నేతలు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రైతు గడపకు మార్కెట్

**కుప్పం (జర్నలిస్ట్ ఫైల్) :** దేశంలోని గోల్డెన్ క్వాడ్రిలేటరల్ తరహాలోనే నదుల అనుసంధానం జరగాల్సి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభిప్రాయం వ్యక్తం చేశారు. గంగా- కావేరి అనుసంధానం ద్వారా దేశంలోని వివిధ ప్రాంతాలకు నీటి భద్రతను సాధించే అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. కుప్పంలో స్థానిక రైతులతో నిర్వహించిన ఆత్మీయ పలకరింపు సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. అంతకుముందు సీఎం చంద్రబాబు సమక్షంలో స్థానిక రైతులకు ప్రయోజనం కలిగేలా ఐటీసీ సంస్థతో కుప్పం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ ఒప్పందం కుదుర్చుకుంది. కుప్పంలోని పండ్లు, కూరగాయల క్లస్టర్ల ద్వారా బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్ నగరానికి ఉత్పత్తులు మార్కెటింగ్ చేసేలా ఈ ఒప్పందం జరిగింది. ఆధునిక, సుస్థిర వ్యవసాయ విధానాలు, ఉత్పత్తులకు విలువ జోడింపుపై కడాతో విశాలాక్షి ఇన్నోవేషన్స్ సస్టెయినబుల్ వ్యాల్యూ చైన్ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ...నీటి భద్రతతో పాటు పర్యాటకాన్ని కూడా కుప్పంలో అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. హంద్రీనీవా నీరు ఈ ప్రాంతానికి తరలించగలిగాం. శ్రీశైలం నుంచి కంగుంది వరకూ నీళ్లు వచ్చాయి. శ్రీశైలం మల్లన్న దగ్గరి శ్రీశైలం డ్యామ్ నుంచి తిరుపతి వెంకన్న దగ్గరున్న కల్యాణి డ్యామ్ వరకూ త్వరలోనే నీళ్లు తీసుకువస్తాం. మన దగ్గర పడిన వర్షాన్ని భూగర్భజలాలుగా మార్చుకునే ప్రయత్నం చేద్దాం. దీనికి సంబంధించిన స్ట్రక్చర్ల నిర్మాణాలు జరగాలి. తుంగభద్ర డ్యామ్ కొత్త గేట్లను ప్రారంభించే సమయంలో మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కలిసి పరీవాహక ప్రాంతంలో నీటి పారుదలపై ఏకాభిప్రాయానికి వచ్చాం. రైతుల ప్రయోజనాలు



కాపాడేలా చర్యలు ప్రారంభించాం. గోదావరి-కావేరిని కలిపితే దక్షిణాదిలో నీటి కరవు తీర్చేందుకు ఆస్కారం ఉంటుంది.

దేశంలోని ఇతర నదులు కూడా అనుసంధానం చేసుకుంటేనే పరిస్థితులు మారతాయి. మహానది నుంచి కావేరి వరకూ- అలాగే గంగా నది నుంచి కావేరి వరకూ గోల్డెన్ క్వాడ్రిలేటరల్ రహదారిలా నదుల అనుసంధానం జరగాలి. అదే జరిగిదే ఇక దేశానికి కరువు అనేదే రాదు. రైతులకు విస్తృత ప్రయోజనాలు అందుతాయ'ని ముఖ్యమంత్రి అన్నారు.

**కుప్పం క్లస్టర్ల నుంచి ఉద్యాన ఉత్పత్తులు :** ఆధునిక వ్యవసాయ పద్ధతుల ద్వారా అధిక ఆదాయం, మెరుగైన దిగుబడి సాధించేందుకు ఆస్కారం ఉందని సీఎం అన్నారు. రైతులు ఆధునిక విధానాలను అనుసరించటంతో పాటు మెరుగైన మార్కెటింగ్ ను అందిపుచ్చుకోవాలి. కుప్పంలో నియంత్రిత వాతావరణంలో 10 వేల టన్నుల టమాటోలు పండించి ఎగుమతి చేసేలా ఐటీసీ సంస్థ ప్రణాళిక చేస్తుంది. వెయ్యి ఎకరాల్లో ఈ సాగు చేపట్టేందుకు ఐటీసీ ముందుకు వచ్చింది. ఆదర్శ రైతులు దీనికి సహకరించాలి. రూ.8 కోట్లను వ్యయం చేసి ఐటీసీ సంస్థ మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తుంది. పౌల్ట్రీ, డెయిరీ, ఫుడ్ ప్రాసెసింగ్ లాంటి రంగాల్లో పెట్టుబడులు వస్తున్నాయి. రూ.10 వేల కోట్ల మేర వివిధ ప్రాజెక్టులు కుప్పంలో వచ్చాయి. ఏబీఐఎస్, మదర్ డెయిరీ, ఐటీసీ లాంటి ప్రతిష్టాత్మక సంస్థలు పెట్టుబడి పెడుతున్నాయి. ఉద్యాన ఉత్పత్తులను సాగు చేయటంలో రాయలసీమ దేశంలోనే నెంబర్ 1 స్థాయికి చేరుకుంది. పూర్వోదయ స్కీమ్ ద్వారా ప్రభుత్వం రూ.40 వేల కోట్లు, ప్రైవేటు రంగంలో రూ.60 వేల కోట్ల పెట్టుబడులు ఈ ప్రాంతానికి వస్తాయి. రహదారులు, సాగునీటి ప్రాజెక్టులు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించేలా ప్రభుత్వం, ఫుడ్ ప్రాసెసింగ్ ప్రాజెక్టులు ప్రైవేటు రంగంలో పెట్టుబడులు పెడతాయి. అంతర్జాతీయంగా డిమాండ్ ఉన్న పండ్లు, ఉద్యాన ఉత్పత్తులను సాగు చేసేలా ప్రణాళికలు చేద్దాం. ఆధునిక వ్యవసాయ విధానాలను, పరికరాలను రైతులు ఉపయోగించాలని కోరుతున్నాను" అని సీఎం స్పష్టం చేశారు.

**ప్రకృతి సేద్యంతో ప్రయోజనాలు :** పురుగుమందులు వాడకుండా ప్రకృతి సేద్యంతో మన రైతులు ప్రపంచానికి నమూనాగా నిలవాలని సీఎం అన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు ఈ ప్రయోజనాలు పొందే అవకాశం ఉంటుందని అన్నారు. మన రైతుల కృషికి చేసిన పనికి గుర్తింపుగా స్విట్జర్లాండ్ లో ప్లానెట్ ఫుడ్ ప్రైజ్ ఇచ్చారన్నారు. ఆరోగ్యకరమైన జీవన విధానం ప్రకృతి సేద్యం ద్వారానే సాధ్యం అవుతుందన్నారు. సాఫ్ట్ వేర్ ఇంజనీర్లు కూడా ఉద్యోగాలు వదిలి పెట్టి ప్రకృతి వ్యవసాయం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. గత సీజన్ లో రూ.4 చొప్పున తోతాపురి మామిడికి అదనపు ధర ఇచ్చామని.. రూ.259 కోట్ల మేర రైతులకు సాయం అందించామన్నారు. ఈసారి కూడా రైతులకు సాయం అందిస్తామన్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను సీఎం సందర్శించారు. మిల్లెట్ చెఫ్ పేరిట మైదా, పంచదార లేకుండా తయారు చేసిన బేకరీ ఫుడ్ స్టాల్ ను సీఎం ఆసక్తిగా పరిశీలించారు. ఆ సంస్థ రూపొందించిన రైస్ ఫ్రీ హోటల్ కాన్సెప్ట్ గురించి అడిగి తెలుసుకున్నారు. మిల్లెట్ చెఫ్ బేకరీ లు కుప్పం లో రెండు ప్రారంభించాలని సీఎం కోరారు. అంతకుముందు ప్రకృతి సేద్యం చేస్తున్న రైతులతో ముఖ్యమంత్రి మాట్లాడి సాగు విధానాలు తెలుసుకుని వారిని అభినందించారు.

# మత్స్యకారుల రక్షణకు ముమ్మర చర్యలు

(మొదటి పేజీ తరువాయి)



మత్స్యశాఖ అధికారులు సమన్వయంతో విస్తృతంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారని మంత్రి తెలిపారు. గల్లంతైన ప్రతి మత్స్యకారుడిని సురక్షితంగా రక్షించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రయత్నిస్తోందని, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు.

గల్లంతైన వారిలో కారి గంగయ్య, అమర అప్పలరాజు, కారి సితోడు, మేడ చిన అమ్మోరు, కారి చిన్నయ్య, రాగుతూ బండియ్య ఉన్నారని , ప్రాణాలకు తెగించి కారి చిన్న మత్స్యకారుడిని రక్షించిన మర్చంట్ నౌక కెప్టెన్, సిబ్బందికి మంత్రి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.

ఒడిశా ప్రభుత్వం, మెరైన్ పోలీస్, మత్స్యశాఖ అధికారుల సమన్వయంతో 10 మంది మత్స్యకారులు క్షేమంగా బయటపడ్డారు

ఒడిశా తీరంలో సాంకేతిక లోపం కారణంగా చిక్కుకున్న విశాఖపట్నానికి చెందిన మెకనైజ్డ్ ఫిషింగ్ బోటులో ఉన్న బోటు యజమాని దానయ్యతో పాటు మొత్తం 10 మంది మత్స్యకారులను సురక్షితంగా రక్షించినట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. బోటు ఇంజిన్ పనిచేయకపోవడం, యాంకర్ కోల్పోవడంతో మత్స్యకారులు సముద్రంలో చిక్కుకున్నట్లు సమాచారం అందిన వెంటనే ఒడిశా మెరైన్ పోలీస్, మత్స్యశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. మంత్రి ఆదేశాల మేరకు ఒడిశా మెరైన్ పోలీస్, మత్స్యశాఖ అధికారులు వేగంగా స్పందించి రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించి బోటు యజమాని దానయ్యతో పాటు మొత్తం 10 మంది మత్స్యకారులను సురక్షితంగా రక్షించారు. ప్రస్తుతం వారందరూ క్షేమంగా ఉన్నారని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా సకాలంలో స్పందించి మత్స్యకారుల ప్రాణాలను కాపాడిన ఒడిశా ప్రభుత్వం, ఒడిశా మెరైన్ పోలీస్, మత్స్యశాఖ అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. రక్షించబడిన మత్స్యకారులను వారి స్వస్థలమైన విశాఖపట్నానికి చేర్చేందుకు అవసరమైన అన్ని చర్యలను రాష్ట్ర ప్రభుత్వం చేపడుతోందని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు.

# యువతకు ఉద్యోగ అవకాశాలు..



(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ, ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్న యువతకు ప్రభుత్వం మరిన్ని అవకాశాలు కల్పించేందుకు కట్టుబడి ఉందన్నారు. జాబ్ మేళా ద్వారా వివిధ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలను కల్పించడం ఆనందంగా ఉందని తెలిపారు.

ప్రజా దర్బార్‌లో హైదరాబాద్‌లో నివసిస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక, పరిపాలనా సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా, ప్రతి వినతిని ఓర్పుగా విని సంబంధిత అధికారులతో సమన్వయం చేసి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ప్రజలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, ఎక్కడ ఉన్నా ఆంధ్రప్రదేశ్ ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ఉపాధి కల్పనతో పాటు ప్రజల సమస్యల పరిష్కారానికి ఇటువంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా టిడిపి అధ్యక్షులుగుత్తుల సాయి , ప్రధాన కార్యదర్శి గంధం బాలరాజు ,రాజేష్ అంగటి , రేవు శ్రీను, తెలంగాణ రాష్ట్ర టీడీపీ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ప్రజాప్రతినిధులు, ఆంధ్రప్రదేశ్ అధికారులు, మంత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ముంబయిని ముంచెత్తిన వాన

(మొదటి పేజీ తరువాయి)

వల్ల రన్‌వే కార్యకలాపాలు ప్రభావం చూపాయి. నియమ, నిబంధనల ప్రకారం, ప్రయాణికులు, విమానాలు, గ్రౌండ్ సిబ్బంది భద్రతను దృష్టిలో ఉంచుకొని రన్‌వే కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేశాం" అని తెలిపింది. వాతావరణ పరిస్థితులు మెరుగుపడిన తర్వాత, ఒక గంట వ్యవధిలోనే రన్‌వేపై సాధారణ కార్యకలాపాలు మళ్లీ ప్రారంభమైనట్లు వారు తెలిపారు. రద్దు అయిన నాలుగు ఇండిగో విమానాల్లో 6ఈ 395 (దిల్లీ-ముంబయి), 6ఈ 5273 (ముంబయి-ఇండోర్), 6ఈ 552 (ఇండోర్-ముంబయి), 6ఈ 6613 (ముంబయి-దిల్లీ) ఉన్నట్లు సమాచారం. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ) వర్గాల సమాచారం ప్రకారం, ఈ విమానాశ్రయం రోజుకు 980 నుంచి 1000 విమానాల రాకపోకలను నిర్వహిస్తుంది. ఇక్కడ గంటకు సగటున 48 విమానాల రాకపోకలు జరుగుతుంటాయి.

అంబానీ కాన్వాయ్‌కు తప్పిన ప్రమాదం

ప్రముఖ వ్యాపారవేత్త ముకేశ్ అంబానీ కాన్వాయ్‌కు ఆదివారం పెను ప్రమాదం తప్పింది. పశ్చిమ శివారులోని బంద్రా ప్రాంతంలో ఒక భారీ చెట్టు అంబానీ కాన్వాయ్ ముందే కూలిపోయింది. దీనితో అందులోని వారికి పెను ప్రమాదం తప్పింది. చెట్టు కూలడంతో కాసేపు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. అయితే అధికారులు సదరు చెట్టును తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేసింది.

**చెట్టు కూలి 63 ఏళ్ల వృద్ధుడు మృతి :** కుర్లాలోని కమాని ప్రాంతంలోని నవ-పాడలో ఒక చెట్టు కూలడంతో 63 ఏళ్ల యూనస్ కుందవాలా మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, నవపాడలోని బీఎంసీ పాఠశాల సమీపంలోని గోమ్స్ గౌన్ బిల్డింగ్ ఏరియాలో ఈ ప్రమాదం జరిగింది. బలమైన గాలి కారణంగా ఒక పెద్ద చెట్టు పక్కనే ఉన్న దుకాణంపై పడిపోయింది. ఆ సమయంలో యూనస్ కుందవాలా దుకాణంలో ఉన్నారు. భారీ చెట్టు పడడంతో ఆయనకు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు ఆయనను ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేసినప్పటికీ, బాధితుడు మార్గమధ్యంలోనే మరణించాడు.

**రెడ్ అలర్ట్:** భారీ వర్షాలతో ముంబయిలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. దీనితో వాహనాల రాకపోకలు స్తంభించాయి. మెట్రో మార్గాల్లోనూ అంతరాయం ఏర్పడుతుంది. ఇంకా వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. సముద్రపు అలలు 4.19 మీటర్ల ఎత్తున ఎగసిపడే అవకాశం ఉందని పేర్కొంది. అందుకే తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఈ నేపథ్యంలో ప్రజల కోసం 1916 హెల్ప్‌లైన్ నంబర్‌ను బీఎంసీ అధికారులు ఏర్పాటు చేశారు. ఇప్పటికే జలదిగ్బంధంలో చిక్కుకున్న ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించే ప్రయత్నాలు చేస్తున్నారు.

# స్థానికంగానే స్కాన్లు.. శస్త్రచికిత్సలు

(మొదటి పేజీ తరువాయి)

దీనివల్ల బోధనాసుపత్రులపై ఒత్తిడి తగ్గడంతోపాటు రోగులను ఇతర ప్రాంతాలకు పంపే అవసరం క్రమంగా తగ్గుతోంది. గత వైకాపా ప్రభుత్వం ఐదేళ్లలో సెకండరీ ఆసుపత్రుల వైద్య పరికరాల కోసం రూ. 42 కోట్లు ఖర్చు చేయగా.. కూటమి ప్రభుత్వం కేవలం రెండేళ్లలోనే మరో రూ. 72.81 కోట్లతో కొత్త పరికరాలు, సదుపాయాలను కల్పిస్తోంది. టెలీ రేడియాలజీ, సీటీ, టిఫా స్కాన్లు, కలర్ డాప్లర్ అల్ట్రాసౌండ్ యంత్రాలు, ల్యాప్రోస్కోపీ పరికరాలతోపాటు నవజాత శిశువుల సంరక్షణ, ప్రయోగశాల పరీక్షలకు అవసరమైన పరికరాలను ఆసుపత్రులకు అందిస్తోంది.

నవజాత శిశువుల శరీర ఉష్ణోగ్రతను కాపాడేందుకు బేబీ వార్మర్లను సమకూరుస్తున్నారు. చిన్నారుల కామెర్ల చికిత్సకు అవసరమైన ఫొటోథెరపీ యంత్రాలు, ఇతర మార్కు సదుపాయాలు కల్పిస్తున్నట్లు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ వెల్లడిశీచారు. "సెకండరీ ఆసుపత్రుల్లో ముఖ్యమైన వసతులు కల్పించడం ద్వారా రోగులకు త్వరగా వైద్యం అందుతోశీది. దీనివల్ల త్వరగా రోగులు కోలుకోవడం వల్ల సదరు కుటుంబాలు వారికి ఉపసమనశీ లభిస్తోంది. వ్యయప్రాయ సాలు, ఖర్చులు తగ్గుతాయి" అని మంత్రి పేర్కొన్నారు

**పెరిగిన వ్యాధి నిర్ధారణ పరీక్షలు :** ప్రస్తుతం ఆసుపత్రుల్లో ఉన్న ల్యాబ్స్ ద్వారా ఏప్రిల్ 2024, మార్చి 2025 మధ్య 3,73,70,704 పరీక్షలు జరగ్గా, ఏప్రిల్ 2025 నుంచి మార్చి 2026 మధ్య 4,48,37,887 పరీక్షలు జరిగాయి. అలాగే రిఫరల్ కేసులు గ్గించి సంక్లిష్టమైన శస్త్ర చికిత్సలను చేయడం క్రమంగా సెకండరీ ఆసుపత్రుల్లో పెరుగుతున్నట్లు మంత్రి సత్యకుమార్ తెలిపారు



**టెలీ రేడియాలజీ సేవలతో రోగులకు ఉపశమనం :** గత ప్రభుత్వ హయాంలో 154 ఆసుపత్రుల్లో మాత్రమే టెలీ రేడియాలజీ సేవలు ఉండేవి. మిగిలిన 89 ఆసుపత్రుల్లోనూ ఈ సేవలు కల్పించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే 80 ఆసుపత్రుల్లో ఈ సేవలను ప్రారంభించింది. మిగిలిన తొమ్మిది ఆసుపత్రుల్లో ఈ సేవలు రెండు, మూడు నెలల్లో అందుబాటులోకి తీసుకురానున్నాయి.

సెకండరీ ఆసుపత్రుల్లో తీసే ఎక్స్‌రే చిత్రాలను నిపుణులు పరిశీలించి సత్వర నివేదికలు అందిస్తున్నారు. దీనివల్ల రోగ నిర్ధారణ వేగవంతం కావడంతోపాటు అనవసర రిఫరల్స్ క్రమంగా తగ్గుతున్నాయి.

**తెనాలి ఆత్మకూరు, హిందూపురం, తణుకు జిల్లా ఆసుపత్రులకు సీటీ స్కాన్లు :** తెనాలి, ఆత్మకూరు, హిందూపురం, తణుకు జిల్లా ఆసుపత్రుల్లో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య విధానంలో సీటీ స్కాన్లను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది. మరోవైపు.. పసిబిడ్డల కోసం 403 వార్మర్లు నవజాత శిశువుల శరీర ఉష్ణోగ్రతను కాపాడేందుకు 403 బేబీ వార్మర్లను సమకూరుస్తున్నారు. చిన్నారుల్లో కామెర్ల చికిత్సకు అవసరమైన రెండు వైపుల ఫొటోథెరపీ యంత్రాలను ఎంపిక చేసిన సెకండరీ ఆసుపత్రులకు పంపుతున్నారు. గర్భంలోని శిశువు గుండె పనితీరును గుర్తించేందుకు 200 ఫీటల్ డాప్లర్లు, రోగుల పరీక్షల కోసం అవసరమైన 221 టేబుళ్లు, 307 పరీక్ష దీపాలను కూడా ఆసుపత్రులకు పంపుతున్నారు.

**నెలకు 1,500 మంది గర్భిణులకు 'టిఫా' పరీక్షలు :** పార్వతీపురం, అనకాపల్లి, తెనాలి జిల్లా ఆసుపత్రులు, ఒంగోలు మాతా శిశు సంరక్షణ ఆసుపత్రితోపాటు నర్సీపట్నం, తుని, నందిగామ, ధర్మవరం ప్రాంతీయ ఆసుపత్రుల్లో రూ. 2.47 కోట్లతో టిఫా స్కాన్ యంత్రాలను ఏర్పాటు చేశారు.

ఈ ఎనిమిది ఆసుపత్రుల్లో నెలకు సగటున 1,500 మంది గర్భిణులు పరీక్షలు చేయించుకుంటున్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో ఒక్కో టిఫా స్కాన్‌కు సుమారు రూ. 7 వేల వరకు ఖర్చవుతోంది. సెకండరీ ఆసుపత్రుల్లో ఈ సేవను అందుబాటులోకి తీసుకురావడం రాష్ట్రంలో ఇదే తొలిసారి.

**రూ.7.49 కోట్లతో 13 ప్రయోగశాలలు :** జాతీయ ఆరోగ్య మిషన్ కింద 13 ప్రాంతీయ ఆసుపత్రుల్లో సమగ్ర ప్రజారోగ్య ప్రయోగశాలలను ఏర్పాటు చేస్తున్నారు. అరకు, సీతంపేట, అగనంపూడి, తుని, అనపర్తి, జంగారెడ్డిగూడెం, నందిగామ, నరసరావుపేట, చీరాల, గూడూరు, పలమనేరు, గుంతకల్లు, బనగానపల్లి ఆసుపత్రుల్లో ఇవి అందుబాటులోకి రానున్నాయి. రూ. 7.49 కోట్లతో రక్తకణాలు, జీవరసాయనాలు, హార్మోన్లు, కణజాల పరీక్షలకు అవసరమైన ఆధునిక పరికరాలను ఈ ప్రయోగశాలల్లో ఏర్పాటు చేస్తున్నారు.

**అల్ట్రా సౌండ్ మెషన్లు కూడా :** ఎస్.కోట, అగనంపూడి, నరసరావుపేట, జమ్మలమడుగు, ధర్మవరం ప్రాంతీయ ఆసుపత్రులతో పాటు 24 సామాజిక ఆసుపత్రుల్లో కలర్ డాప్లర్ అల్ట్రాసౌండ్ మిషన్లు సిద్ధం చేశారు. ప్రాంతీయ ఆసుపత్రుల్లో ఒక్కో యంత్రానికి రూ. 13.54 లక్షల వరకు ఖర్చు చేశారు.

**బెరా యంత్రాలూ సిద్ధం :** చెవి సంబంధిత పరీక్షలు, సదరం అవసరాల కోసం బెరా యంత్రాలు, ప్యూర్‌టోన్ ఆడియోమీటర్లు, శబ్ద నిరోధక గదులను సిద్ధం చేస్తున్నారు. ఇందుకోసం రూ. 19.49 కోట్ల వరకు వెచ్చిస్తున్నారు.

**15 ఆసుపత్రుల్లో ల్యాప్రోస్కోపీ పరికరాలు :** టెక్కలి, పార్వతీపురం, తణుకు, ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రులతోపాటు సీతంపేట, అగనంపూడి, అనపర్తి, రామచంద్రాపురం, నూజివీడు, నరసరావుపేట, కుప్పం, శ్రీకాళహస్తి, రాయచోటి, తాడిపత్రి, ధర్మవరం ప్రాంతీయ ఆసుపత్రుల్లో రూ. 5.50 కోట్లతో ల్యాప్రోస్కోపీ పరికరాలను ఏర్పాటు చేశారు. దీంతో పెద్ద కోతలు లేకుండా శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు వీలు కలిగింది. రోగులు త్వరగా కోలుకోవడంతోపాటు దూర ప్రాంతాల్లోని బోధనాసుపత్రులకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతోంది.

**ఇటీవల సెకండరీ ఆసుపత్రులకు 177 మార్చురీ ఫ్రీజర్ ఛాంబర్లు :** తాజాగా జరిగిన సమీక్ష సమావేశంలో గడిచిన రెండు సంవత్సరాల్లో సెకండరీ ఆసుపత్రుల్లో జరిగిన అభివృద్ధి గురించి డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ చక్రధర బాబు మంత్రి సత్య కుమార్ కు నివేదించారు.

# అనాథలకు ఆహారం పంపిణీ



**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్):** పట్టణంలోని నందులపేటలో ఉన్న 'పట్టణ పేదల నిరాశ్రయుల అనాథ శరణాలయం'లో, 'ది సిటిజన్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్' తెనాలి శాఖ సిబ్బంది ఆహారాన్ని మరియు దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మేనేజర్ డి. శంకర్ రావుతో పాటు బ్రాంచ్ మేనేజర్ వై. శశాంక, సిహెచ్. గణేష్, డి. సాయి కృష్ణ, ఎ. దిలీప్, సిహెచ్. కృష్ణ చైతన్య మరియు ఆర్. రమణ కుమారి పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకార శాఖ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మరియు మంత్రి అమిత్ షా పిలుపు మేరకు 'సహకార వారోత్సవాల'లో భాగంగా, 'ది సిటిజన్ కో-ఆపరేటివ్ సొసైటీ'ఈ కార్యక్రమాన్ని అనాథ శరణాలయంలో నిర్వహించారు.

# ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్‌కు జేఏసీ వినతి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ గుంటూరు జిల్లా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) నాయకులు శనివారం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

జేఏసీ జిల్లా ఛైర్మన్ ఘంటసాల శ్రీనివాసరావు, కన్వీనర్ ఎండి ఖాలీద్, కార్యదర్శి గార్ల నాయకత్వంలో కలెక్టర్‌ను కలిసిన ప్రతినిధులు గత మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను వివరించారు. వేతన సవరణను అమలు చేయడం, సరెండర్ లీవుల నగదు చెల్లింపు, నాలుగు కరవు భత్యాల (డీఏ) విడుదల, ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుంచి మినహాయింపు, సీపీఎస్ రద్దు సహా మొత్తం 10 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు.

ఈ సందర్భంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఆర్టీసీ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని జేఏసీ నాయకులు కోరారు. ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన పెండింగ్ అంశాలను ప్రాధాన్యంగా పరిగణించి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శ్యాంసుందర్ శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్కే నాగూర్ షరీఫ్, జేఏసీ గుంటూరు నగర శాఖ ఛైర్మన్ చింతల కళ్యాణ్ కుమార్, యూటీఎఫ్ అధ్యక్షుడు రాజశేఖర్, కార్యదర్శి రెడ్డి, ఎన్‌జీజీవో జిల్లా ఉపాధ్యక్షులు నరసింహారావు, కిషోర్, సిటీ ట్రెజరర్ సాంబశివరావు, ఇరిగేషన్ శాఖకు చెందిన శ్రీనివాసరావు, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## రోడ్స్ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం నూతన అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేసిన గుమ్మడి స్వరాజ్ బాబు!



**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్):** రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం నూతన కమిటీ ఇన్‌స్టలేషన్ కార్యక్రమం పట్నంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న ఈ కన్వెన్షన్ లో నిర్వహించారు. పూర్వాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఇన్‌స్టలేషన్ ఆఫీసర్ గా డిస్టిక్ గవర్నర్ ఎలెక్ట్ ముళ్ళపూడి హరిహర ప్రసాద్, ముఖ్య అతిథులుగా డిస్టిక్ అవార్డ్స్ చైర్మన్ పివి సత్యనారాయణ, అసిస్టెంట్ గవర్నర్ జంగా వెంకటేష్ పాల్గొని కొత్తగా ఎన్నికైన అధ్యక్షులుగా గుమ్మడి స్వరాజ్ బాబు, కార్యదర్శిగా కొల్లి రాజేంద్రప్రసాద్, కోశాధికారిగా జాస్తి నరేంద్ర చే ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో జిల్లా ఫస్ట్ వచ్చిన విద్యార్థినికి ప్రోత్సాహ బహుమతిని ముఖ్య అతిథులు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ కార్యదర్శి గుమ్మడి వెంకటనారాయణ , పూర్వ అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణ చంద్, డిస్టిక్ టీం కన్నెగంటి మురళీకృష్ణ, రోటరీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# శ్యామ ప్రసాద్ ముఖర్జీకి నివాళి - బెంగాల్‌లో బీజేపీ గెలుపు

వ్యాసకర్త బిజెపి రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి ఎన్ మధుకర్ జీ

శ్యామ ప్రసాద్ ముఖర్జీ నివాళి – బెంగాల్ లో బిజెపి గెలుపు

దేశ స్వాతంత్ర్యం తరువాత బెంగాల్ ప్రజలు మళ్లీ అమితానందంతో సంబరాలు చేసుకుంటున్న సంవత్సరమిది. దేశ స్వాతంత్ర్య సమరానికి దిక్సూచిగా నిలిచిన మహనీయులు, జాతీయవాదులు, సామాజిక సంస్కర్తలు, వారి త్యాగం, వారి భావజాలం, వారి మార్గదర్శకత్వాన్ని విదేశీ అరువు భావజాల ఆధారిత ప్రభుత్వాలు కాలక్రమేణా మరుగునపరిచాయి. వారి నిరంకుశ పాలనలను చూసి విసిగివేసారిపోయిన బెంగాల్ ప్రజలు తమ వారసత్వం ఎంత గొప్పదో, దేశ సరిహద్దుల విషయంలో, దేశ సమైక్యతలో తమ బాధ్యత ఎంత కీలకమో గ్రహించారు. గతంలో జరిగిన రాజకీయ పొరపాట్లను సరిదిద్దుకుంటూ జాతీయవాద ప్రధాన స్రవంతిలో కలవాలన్న ఆలోచనను ఓటు రూపంలో ప్రదర్శించిన బెంగాల్ ప్రజల ఆకాంక్షకు ప్రతిరూపమే 2026 బెంగాల్ ఎన్నికల ఫలితం.


1977లో బెంగాల్ ప్రజలు విదేశీ భావజాల ప్రభావంలో కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారు. దాదాపు 34 వత్సరాల తర్వాత, 2011లో ఆ పాలన నుంచి బయటపడినా, ప్రత్యామ్నాయంగా ఎంచుకున్న రాజకీయ శక్తులు కూడా భారత జాతీయ ప్రయోజనాలకు విరుద్ధంగా, విదేశీ ప్రభావాలకు అనుకూలంగా, దేశ వ్యతిరేక శక్తులకు అండగా నిలుస్తున్నాయనే వాస్తవం ప్రజలకు క్రమంగా అర్థమైంది. ఈ అవగాహన 2026 నాటికి మరింత స్పష్టమైంది. ఫలితంగా, నిద్రాణంగా ఉన్న జాతీయ భావం మేల్కొని, భావజాల మార్పు పట్ల ఆకాంక్ష పెరిగి, భారతీయ జనతా పార్టీ విజయానికి బాట వేసింది.

2026లో పశ్చిమ బెంగాల్‌లో సువేందు అధికారి నాయకత్వంలో ఏర్పడిన భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం కేవలం ఒక ఎన్నికల విజయంగా మాత్రమే కాకుండా, భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ గారి 125వ జయంతి సందర్భంగా ఆయనకు ప్రజలు సమర్పించే గొప్ప నివాళిగా భావించవచ్చు. ఇది కేవలం ఒక ప్రభుత్వ మార్పుగా మాత్రమేకాక డా. శ్యామ ప్రసాద్ జీ జీవితాంతం ప్రతిపాదించిన జాతీయవాద భావజాలానికి లభించిన ప్రజా మద్దతుగా చూడవచ్చు.

భారతదేశ చరిత్రలో అధికార పదవులను దేశసేవకు సాధనంగా భావించిన మహనీయులు కొద్దిమందే ఉన్నారు. అలాంటి మహనీయుల్లో డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ పేరు శాశ్వతంగా నిలిచిపోతుంది. ఆయనకు రాజకీయాలు అధికారాన్ని అనుభవించడానికి కాదు, దేశాన్ని బలపరచడానికి, భారతీయ సంస్కృతిని కాపాడడానికి, జాతీయ సమైక్యతను నిలబెట్టడానికి ఒక సాధనంగా కనిపించాయి.

డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ 1901 జూలై 6న కలకత్తాలో ఒక విద్యావంతుల కుటుంబంలో జన్మించారు. తండ్రి "బెంగాల్ టైగర్"గా ప్రసిద్ధి పొందిన కలకత్తా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆశుతోష్ ముఖర్జీ. తల్లి జోగమాయా దేవి. కలకత్తాలోని ప్రముఖ విద్యాసంస్థల్లో ప్రాథమిక, ఉన్నత విద్యను పూర్తి చేసిన ఆయన, అనంతరం కలకత్తా విశ్వవిద్యాలయంలో ఆంగ్ల సాహిత్యంలో పట్టభద్రుడయ్యారు. అనంతరం న్యాయశాస్త్రంలో పట్టా పొంది న్యాయవాద వృత్తిలో ప్రవేశించారు. ఉన్నత విద్య కోసం ఆయన ఇంగ్లండ్ వెళ్లి న్యాయశాస్త్రంలో శిక్షణ పొంది బారిస్టర్‌గా అర్హత సాధించారు. కేవలం 33 సంవత్సరాల వయస్సులోనే కలకత్తా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్‌గా బాధ్యతలు చేపట్టారు.

1947 ఆగస్టు 15న దేశం స్వాతంత్ర్యం పొందిన అనంతరం పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ నేతృత్వంలో ఏర్పడిన కేంద్ర మంత్రివర్గంలో హిందూ మహాసభ ప్రతినిధిగా శ్యామ ప్రసాద్ ముఖర్జీ పరిశ్రమలు మరియు పౌర సరఫరాల మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. కొంతకాలం పాటు ప్రభుత్వంలో



మంత్రిగా పని చేసిన శ్యామ ప్రసాద్ ముఖర్జీ, క్రమంగా జవహర్‌లాల్ నెహ్రూ దేశ సమగ్రతకు వ్యతిరేకంగా తీసుకుంటున్న విధానాలపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ముఖ్యంగా నెహ్రూ హిందుత్వం పట్ల వ్యతిరేకత, జమ్మూ-కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పిస్తూ దొంగదారిలో ఆర్టికల్ 370ని రాజ్యాంగంలో చొప్పించడంపై ఆయనకు తీవ్రమైన విభేదాలు ఏర్పడ్డాయి. దేశం అంతా ఒకటే అయినప్పుడు ఒక రాష్ట్రానికి ప్రత్యేక రాజ్యాంగం, ప్రత్యేక జెండా, ప్రత్యేక నిబంధనలు ఉండటం భారత సమైక్యతకు భంగం కలిగిస్తుందని ఆయన భావించారు.

ఆయన దృష్టిలో బెంగాల్ రాజకీయంగా మాత్రమే కాదు, దేశ భద్రత పరంగా కూడా అత్యంత కీలకమైన రాష్ట్రం. సరిహద్దు భద్రత, అక్రమ చొరబాట్లు, జనాభా సమతుల్యత, జాతీయ సమైక్యత వంటి అంశాలపై ఆయన పలుమార్లు హెచ్చరికలు చేశారు. అదే సమయంలో తూర్పు పాకిస్థాన్ (నేటి బంగ్లాదేశ్)లో హిందువులపై జరుగుతున్న దాడులు, వారి భద్రతపై కేంద్ర ప్రభుత్వం అవలంబించిన విధానంపై కూడా ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ అంశాలన్నింటి నేపథ్యంలో తన పదవి కంటే దేశ ప్రయోజనాలే ముఖ్యమని భావించిన శ్యామ ప్రసాద్ ముఖర్జీ అధికారాన్ని వదులుకోవడం వ్యక్తిగతంగా తనకు నష్టం అయినా, దేశ ప్రయోజనం ముందు తన పదవికి విలువ లేదనే ఆలోచనతో 1950లో కేంద్ర మంత్రివర్గానికి రాజీనామా చేసి ప్రజా ఉద్యమ మార్గాన్ని ఎంచుకున్నారు. అది ఆయనలోని మహోన్నత వ్యక్తిత్వానికి నిదర్శనం.

రాజీనామా తరువాత దేశవ్యాప్తంగా "ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు, రెండు జెండాలు, రెండు ప్రధానులు ఉండరాదు" అనే ఆయన నినాదం కేవలం రాజకీయ నినాదం మాత్రమే కాదు. భారత సమైక్యతపై ఆయనకు ఉన్న అచంచల విశ్వాసానికి ప్రతీక. దేశం భౌగోళికంగా మాత్రమే కాదు, భావజాలపరంగా కూడా ఏకంగా ఉండాలని ఆయన విశ్వసించారు. ప్రాంతాలు వేరైనా, భాషలు వేరైనా, సంప్రదాయాలు వేరైనా, భారతీయత ఒక్కటే హిందుత్వమే మన అందరినీ కలిపే బంధమని ఆయన ప్రకటించారు. జాతీయవాద భావజాలాన్ని రాజకీయంగా సంఘటితం చేయాల్సిన అవసరాన్ని ఆయన గుర్తించి, భారతదేశం కేవలం భౌగోళిక సరిహద్దులతో ఏర్పడిన దేశం కాదని, వేల సంవత్సరాల సాంస్కృతిక వారసత్వంతో నిర్మితమైన నాగరికత అని ఆయన విశ్వసించారు.

ఈ భావజాలానికి రాజకీయ వేదికగా 1951లో భారతీయ జనసంఘ్‌ను స్థాపించారు. భారతీయ జనసంఘ్ స్థాపనతో భారత రాజకీయాల్లో ఒక కొత్త అధ్యాయం ప్రారంభమైంది. దేశభక్తి, జాతీయ సమైక్యత, సాంస్కృతిక జాతీయవాదం, స్వదేశీ ఆర్థిక దృక్పథం వంటి అంశాలను ప్రధాన సిద్ధాంతాలుగా ఆ పార్టీ ప్రకటించింది. అప్పటి రాజకీయ వాతావరణంలో ఈ భావజాలం పెద్దగా ఆదరణ పొందకపోయినా, శ్యామ ప్రసాద్ ముఖర్జీ తన సిద్ధాంతాలపై విశ్వాసం కోల్పోలేదు. ఆ కాలంలో కాంగ్రెస్ పార్టీ అత్యంత బలమైన రాజకీయ శక్తిగా ఉంది. జనసంఘ్ వంటి కొత్త పార్టీకి పెద్దగా అవకాశాలు లేవని అనేక మంది భావించారు. అయినప్పటికీ, దేశంలో బలమైన జాతీయవాద ప్రత్యామ్నాయం తప్పనిసరిగా ఎదుగుతుందని శ్యామ ప్రసాద్ ముఖర్జీ విశ్వసించారు.

జనసంఘ్ ఆవిర్భావాన్ని విమర్శిస్తూ, ఎదుగుదలను అప్పటి కాంగ్రెస్ నాయకత్వం అనేక వ్యాఖ్యలు చేసింది. ముఖ్యంగా అప్పటి ప్రధాని నెహ్రూ "దేశంలో జనసంఘ్ ని అనగదొక్కుతాను" అని అసహనాన్ని ప్రకటించినప్పటికీ, వ్యక్తిగత విమర్శలకు స్పందించకుండా శ్యామ ప్రసాద్ ముఖర్జీ తన రాజకీయ పోరాటాన్ని కొనసాగించారు. తనకు వ్యతిరేకంగా ఎన్ని విమర్శలు వచ్చినా, దేశ సమైక్యత, భారతీయ సంస్కృతి, జాతీయ భద్రత వంటి అంశాలపై రాజీ పడకూడదనే దృఢ సంకల్పంతో ముందుకు సాగారు. "కాశ్మీర్ భారతదేశానికి అంతర్భాగం" అనే సందేశాన్ని ప్రజల్లో బలంగా నాటేందుకు ఆయన అహర్నిశలు కృషి చేశారు.

1953లో కాశ్మీర్ ప్రవేశానికి అనుమతి పత్రం (పావతీఎత్) తీసుకోవాలని నెహ్రూ ప్రభుత్వం నిబంధన విధించింది. భారతదేశ పౌరుడిగా భారతదేశంలోని ఏ ప్రాంతానికైనా వెళ్లడానికి తనకు అనుమతి అవసరం లేదని డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ ప్రకటించారు. ఆ నమ్మకంతోనే ఆయన అనుమతి పత్రం లేకుండా జమ్మూ--కాశ్మీర్‌లో ప్రవేశించారు. ఆ వెంటనే ఆయనను అరెస్టు చేసి శ్రీనగర్‌లో నిర్బంధించారు. నిర్బంధంలో ఉన్న సమయంలో ఆయన ఆరోగ్యం క్షీణించింది. 1953 జూన్ 23న, తన 52వ జన్మదినానికి కొద్ది రోజుల ముందే అనుమానాస్పద స్థితిలో శ్రీనగర్‌లో ఆయన మరణించారు. తల్లి జోగమాయా దేవి, కుటుంబ సభ్యులు, అనుచరులు, పలు రాజకీయ నాయకులు కూడా డా. ముఖర్జీ మరణంపై సమగ్ర స్వతంత్ర విచారణ జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆయన మరణంపై అప్పటి నుంచి ఇప్పటికీ అనేక ప్రశ్నలు సమాధానం లేకుండానే మిగిలిపోయాయి.

1953 జూన్ 23న డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ భౌతికంగా ఈ లోకాన్ని విడిచిపోయినా, ఆయన ప్రతిపాదించిన జాతీయవాద భావజాలం అంతరించిపోలేదు. ఒక నాయకుడిని కోల్పోయిన బాధ దేశభక్తులలో ఉన్నప్పటికీ, ఆయన చూపిన మార్గాన్ని కొనసాగించాలనే సంకల్పం మరింత బలపడింది. వ్యక్తి కన్నా సిద్ధాంతం గొప్పదని, పదవి కన్నా దేశం గొప్పదని ఆయన జీవితమే భారతీయ జనసంఘ్ కార్యకర్తలకు శాశ్వత సందేశంగా నిలిచింది.

డా. ముఖర్జీ స్థాపించిన భారతీయ జనసంఘ్ ప్రారంభంలో పరిమిత రాజకీయ శక్తిగానే కనిపించింది. కానీ దాని పునాదిలో ఉన్న జాతీయవాదం, సాంస్కృతిక చైతన్యం, అఖండ భారత భావన, స్వదేశీ ఆర్థిక దృక్పథం వంటి అంశాలు క్రమంగా ప్రజల్లో ఆదరణ పొందసాగాయి. ఆయన తరువాత పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ, అటల్ బిహారీ వాజ్‌పేయి, లాల్‌కృష్ణ అద్వానీ వంటి నాయకులు ఆ భావజాలాన్ని దేశమంతటా విస్తరించారు. డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఒకసారి "ఈ దేశ భవిష్యత్తు భారతీయ సంస్కృతిని ఆధారంగా చేసుకున్న జాతీయ చైతన్యంపైనే ఆధారపడి ఉంటుంది" అనే భావాన్ని పలుమార్లు వ్యక్తం చేశారు. రాజకీయ అధికారం మారవచ్చు, ప్రభుత్వాలు రావచ్చు, వెళ్లిపోవచ్చు; కానీ దేశ ఆత్మ అయిన భారతీయతను కాపాడే రాజకీయ శక్తి అవసరమని ఆయన విశ్వసించారు.


1977లో అత్యవసర పరిస్థితి అనంతరం జనసంఘ్ ఇతర పార్టీలతో కలిసి జనతా పార్టీలో విలీనమైంది. అయితే భావజాల భేదాల కారణంగా 1980లో భారతీయ జనతా పార్టీ ఏర్పడింది. ఆ పార్టీ తన సిద్ధాంత మూలాలను భారతీయ జనసంఘ్ నుంచే స్వీకరించింది. అందువల్ల డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీని భారతీయ జనతా పార్టీ తన భావజాల పితామహుడిగా గౌరవిస్తుంది. ప్రారంభ సంవత్సరాల్లో బీజేపీకి పెద్దగా రాజకీయ విజయాలు లభించలేదు. అయినప్పటికీ, కార్యకర్తలు సిద్ధాంతాన్ని వదలకుండా ప్రజల్లో పనిచేశారు. గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేశారు. "అధికారం కోసం కాదు -- దేశం కోసం" అనే భావనతో పార్టీ విస్తరణ కొనసాగింది.

1998లో అటల్ బిహారీ వాజ్‌పేయి నాయకత్వంలో తొలిసారిగా బీజేపీ కేంద్రంలో స్థిరమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. జాతీయ రహదారుల నిర్మాణం, పోఖ్రాన్ అణు పరీక్షలు, మౌలిక వసతుల అభివృద్ధి వంటి చర్యలతో భారతదేశాన్ని కొత్త దిశలో నడిపించే ప్రయత్నం చేసింది. 2014లో నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీకి సంపూర్ణ మెజారిటీ లభించింది. అనంతరం 2019లో మరింత భారీ ప్రజా మద్దతుతో రెండోసారి అధికారంలోకి వచ్చింది. ఈ కాలంలో తీసుకున్న కొన్ని ప్రధాన నిర్ణయాలను డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ ప్రతిపాదించిన భావజాలానికి కొనసాగింపుగా భావించవచ్చు. వాటిలో ముఖ్యంగా జమ్మూ-కాశ్మీర్‌కు సంబంధించిన ఆర్టికల్ 370 నిబంధనల రద్దు, మతపరమైన హింసకు గురైన కొన్ని పొరుగు దేశాల మైనారిటీలకు రక్షణ కల్పించే చర్యగా పౌరసత్వ సవరణ చట్టం (జూూా), అయోధ్యలో శ్రీరామ జన్మభూమి ఆలయ నిర్మాణం, సరిహద్దు భద్రతకు ప్రాధాన్యం, స్వదేశీ రక్షణ సామర్థ్యాల పెంపు, మౌలిక వసతుల అభివృద్ధి వంటి చర్యలను డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఆలోచనలకు, జాతీయవాద దృక్పథానికి అనుగుణమైన నిర్ణయాలుగా చూడవచ్చు.

బెంగాల్ రాజకీయాలను పరిశీలించినప్పుడు కూడా ఈ భావజాల పోరాటం స్పష్టంగా కనిపిస్తుంది. ఒకప్పుడు భారత జాతీయ చైతన్యానికి కేంద్రంగా నిలిచిన బెంగాల్‌లో మళ్లీ జాతీయవాద ఆలోచనలు బలపడటం, డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ వారసత్వంపై చర్చ పెరగడం, ఆయన జన్మభూమిలో ఆయన ఆశయాల గురించి ప్రజల్లో అవగాహన విస్తరించడం గమనించదగిన పరిణామాలు. డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ రాజకీయ జీవితం మనకు ఒక గొప్ప పాఠాన్ని నేర్పుతుంది. సిద్ధాంతం కోసం త్యాగం చేసిన నాయకులు కాలాన్ని జయిస్తారు. అధికారం తాత్కాలికం కావచ్చు, కానీ దేశం కోసం చేసిన త్యాగం శాశ్వతం.

నేడు ఆయన 125వ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న కార్యక్రమాలు కేవలం ఒక నాయకుడి జయంతి వేడుకలు మాత్రమే కాదు. భారతీయత, జాతీయ సమైక్యత, ప్రజాస్వామ్యం, సాంస్కృతిక గౌరవం వంటి విలువలను మరోసారి స్మరించుకునే సందర్భం.

బెంగాల్ నేలపై జాతీయవాద చైతన్యం మరింత బలపడాలని, డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఆశయాలు ప్రజల్లో చిరస్థాయిగా నిలవాలని కోరుకునే ప్రతి ఒక్కరికీ ఆయన జీవితం నిత్యస్ఫూర్తిగా నిలుస్తుంది.



**ఎన్ మధుకర్ జీ**
**(బిజెపి రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి)**

# ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడు ఎర్రబెల్లి దయాకర్ రావు

- పాలకుర్తిలో మాజీ మంత్రి జన్మదిన వేడుకలు
- పంచాయతీ సిబ్బందికి వస్త్రాల పంపిణీ
- వెయ్యి మందికి పైగా అన్నదానం
- సేవా కార్యక్రమాలతో ప్రత్యేక ఆకర్షణ





**జనగామ, జూలై 05 (జర్నలిస్ట్ ఫైల్) :** మాజీ మంత్రి, పాలకుర్తి మాజీ ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్ రావు జన్మదిన వేడుకలు శనివారం పాలకుర్తి మండల కేంద్రంలోని శ్రీ సోమేశ్వర ఫంక్షన్ హాల్‌లో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఎర్రబెల్లి దయాకర్ రావు అభిమాని, శ్రీ మహాలక్ష్మి టెంట్ హౌస్ అండ్ డెకరేషన్ అధినేత రేపాల అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలు అభిమానుల సందడి, సేవా కార్యక్రమాలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉషా దయాకర్ రావు, ఎర్రబెల్లి దయాకర్ రావు ట్రస్ట్ చైర్‌పర్సన్ హాజరై కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ప్రారంభించారు. అనంతరం గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులు, సిబ్బందికి నూతన వస్త్రాలను పంపిణీ చేసి వారిని సన్మానించారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో స్వయంగా భోజనం వడ్డించి ప్రజలతో ఆప్యాయంగా మమేకమయ్యారు. ఈ అన్నదాన కార్యక్రమంలో వెయ్యి మందికి పైగా ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉషా దయాకర్ రావు మాట్లాడుతూ, "ప్రజల ప్రేమే దయన్నకు నిజమైన బలం" అని అన్నారు. రాజకీయాల్లో ఎన్నో ఒడిదుడుకులు వచ్చినా ప్రజల విశ్వాసాన్ని ఎన్నడూ కోల్పోని నాయకుడు ఎర్రబెల్లి దయాకర్ రావు అని పేర్కొన్నారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉంటూ ప్రతి కుటుంబానికి అండగా నిలవడమే ఆయన జీవిత ధ్యేయమని చెప్పారు. లక్షలాది మంది అభిమానాన్ని సంపాదించుకోవడం అదృష్టం మాత్రమే కాదని, అది దశాబ్దాలుగా ప్రజల కోసం చేసిన నిస్వార్థ సేవకు లభించిన గౌరవమని పేర్కొన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం కొందరు నాయకులు దూరమవుతారని, కానీ దయన్నను గుండెల్లో పెట్టుకుని అభిమానించే ప్రజలు ఎప్పటికీ ఆయన వెంటే ఉంటారని అన్నారు. పార్టీ కోసం అహర్నిశలు శ్రమించే కార్యకర్తలు తమ కుటుంబ సభ్యులేనని, కష్టకాలంలో వారికి అండగా నిలవడం దయన్న నైజమని చెప్పారు. పాలకుర్తి ప్రజలకు మరింత చేరువగా ఉండేందుకు దయన్న ఇక్కడే శాశ్వత నివాసం ఏర్పాటు చేసుకునేలా ఇంటి నిర్మాణం చేపట్టినట్లు వెల్లడించారు. గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రతిరోజూ తెల్లవారుజాము నుంచే గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు వారు చేస్తున్న సేవ సమాజానికి ఎంతో విలువైనదని కొనియాడారు. వారి శ్రమను గుర్తించి గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, ఈ సందర్భంగా వారికి వస్త్రాలు అందజేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని ఎర్రబెల్లి దయాకర్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సేవా కార్యక్రమాలు, వస్త్రాల పంపిణీ, వెయ్యి మందికి పైగా అన్నదానం మధ్య జన్మదిన వేడుకలు ఘనంగా, విజయవంతంగా ముగిశాయి.

## బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ని కలిసిన ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు



**ములుగు, జిల్లాప్రతినిధి జూలై 05 (జర్నలిస్ట్ ఫైల్) :** హైదరాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారక రామారావు (కేటీఆర్) ని ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు శనివారం జిల్లాలోని పలువురు బారసా ముఖ్యనాయకులతో కలసి మర్యాద పూర్వకంగా కలిసి, ములుగు జిల్లా రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం, సంస్థాగత కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, ములుగు జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎస్ఐఆర్ (సర్) కార్యక్రమంలో చురుకుగా పాల్గొని, బీఎల్ఓలతో సమన్వయం చేసుకుంటూ ప్రతి ఇంటిని సందర్శించి ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ప్రతి ఓటును పరిరక్షించే బాధ్యతతో అప్రమత్తంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అలాగే, త్వరలో ప్రారంభం కానున్న బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించి, ప్రతి కార్యకర్త, ప్రతి అభిమానికి సభ్యత్వం అందేలా కృషి చేయాలని లక్ష్మణ్ బాబుకి సూచించారు. ములుగు జిల్లాలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కష్టపడి పనిచేస్తున్నారని అభినందించిన కేటీఆర్, ఇదే ఉత్సాహంతో ముందుకు సాగితే రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని పేర్కొన్నారు. ములుగు గడ్డపై గులాబీ జెండా ఎగురవేసే లక్ష్యంతో నాయకులు, కార్యకర్తలు అందరూ ఐక్యంగా పనిచేసి పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బారసా జిల్లా నాయకులు తాటి కృష్ణ, ఎం.డి. వలీ బాబా, ఏటూరు నాగారం పీఏసీఎస్ చైర్మన్ కూనూరు అశోక్ గౌడ్, యలవర్తి శ్రీనివాసరావు, కుర్బాన్ అలీ, గద్దల రఘు, తదితరులు పాల్గొన్నారు.

# కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి కె విజయరాములు..
- ఆస్పత్రి కార్మికులు పోరుబాట.
  ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పి సురేష్..



**వనపర్తి, జూలై 05 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వ ఆసుపత్రులలో పనిచేస్తున్న కాంట్రాక్టు పారిశుధ్య, సెక్యూరిటీ, పేషంట్ కేర్, సూపర్వైజర్ కార్మికులను క్రమబద్ధీకరించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి డిమాండ్ చేశారు. శనివారం వేతనాల పెంపకం ఈ నెల 7 నుంచి మూడు రోజుల పాటు ఏజెన్సీ ల రద్దు, వేతనాలు పెంచాలని ఆసుపత్రి కార్మికుల నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని వైద్యాధికారులకు నోటీసు అందించారు. ఈ సందర్భంగా విజయరాములు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ సూపర్వైజర్ కార్మికులు ఎలాంటి హక్కులు లేకుండా ఉద్యోగ భద్రతకు నోచుకోకుండా దినదిన గండంగా కార్మికుల జీవితాలు ఆగం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా పెంచిన కనీస వేతనాలు పారదర్శకంగా లేవని వాటిని సవరించి తెలంగాణ కనీస వేతన బోర్డు సూచించిన సిఫారసులను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని .. కాంట్రాక్టు కార్మికులందరినీ క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు.

**ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పి సురేష్ మాట్లాడుతూ..**

ప్రభుత్వ ఆసుపత్రి కార్మికుల పట్ల ప్రభుత్వం ఉదాసీనత వివక్ష వైఖరి తగదని అన్నారు. కాల పరిమితి ముగిసిన ఏజెన్సీలను రద్దుచేసి ప్రభుత్వ ఆసుపత్రి కార్మికుల వేతనాల పెంపుకై, ఏజెన్సీల వ్యవస్థ రద్దుకై ఈ నెల 7, 8 తేదీలలో ఆసుపత్రుల ఎదుట రోజు గంట పాటు నిరసన కార్యక్రమాలు చేపట్టి తొమ్మిదిన తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయాలను వేలాదిమంది ప్రభుత్వ ఆసుపత్రి కాంట్రాక్టు కార్మికులతో దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. మూడు రోజులపాటు నిర్వహించే ఆసుపత్రి కార్మికుల పోరుబాటకు కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి గౌను గీతమ్మ, నాయకురాలు కొండికంటి పద్మావతి, ఆసుపత్రి యూనియన్ బ్రాంచ్ నేతలు కార్మికులు నరసింహ, గంధం శీను, శ్యామ్, షాబాద్, రవి, ఆంజనేయులు, వెంకటయ్య, పవన్, శ్రీకాంత్, శివ, గణేష్, శ్రీను, కలవతమ్మ, గోవిందమ్మ, ప్రేమ కుమారి, సంతోషమ్మ, భాగ్యలక్ష్మి, అంజనమ్మ, శ్వేత, రాజేశ్వరి, యాదమ్మ, నవనీత, రజిత, బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కాగితాల్లోనే కమ్యూనిటీ హెల్త్ సెంటర్...

- మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలం..
- ప్రభుత్వ వైద్యశాలను పరిశీలించిన మహిళా సంఘం నాయకులు..



**వెంకటాపురం(నూగూరు), జూలై 05 (జర్నలిస్ట్ ఫైల్) :** రెండున్నర ఏళ్ల క్రితం వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలను పీహెచ్సీ నుండి 30 పడకల సిహెచ్ సిగా అప్ గ్రేడ్ చేశామని పాలకులు చెబుతున్నా సి హెచ్ సి కి సరిపడా వైద్యులను, మౌలిక సదుపాయాలు కల్పించడంలో వైఫల్యం చెందినట్లు అఖిలభారత మహిళా తంత్ర మహిళా సంఘం నాయకులు ఆరోపించారు. శనివారం మండల పరిధిలోని ప్రభుత్వ వైద్యశాలను పరిశీలించిన అనంతరం వారు మాట్లాడుతూ ఏజెన్సీ మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలను ముప్పై పడకల ఆసుపత్రిగా అప్ గ్రేడ్ చేస్తున్నట్లు ప్రకటించారు. వైద్యశాలకు ప్రతిరోజు మండలంలోని వివిధ గ్రామాల నుంచి 200 మందికి పైగా రోగులు ఆసుపత్రికి వస్తున్నారు. వారికి వైద్య సేవలు అందించడానికి సరిపడా వైద్యులు అందుబాటులో లేరు. ఒక వైద్యుడు తో వైద్య సేవలు అందిస్తున్నారు. మహిళల వైద్య చికిత్స కోసం గైనకాలజిస్ట్ అవసరమున్న ఇప్పటివరకు గైనకాలజిస్టు నియమించలేదు. పిల్లలకు సంబంధించిన వైద్య నిపుణులు అందుబాటులో లేరు. గర్భిణీ స్త్రీలకు ప్రసూతి సమయంలో సరిపడా సౌకర్యాలు లేకపోవడంతో దూరంలో ఉన్న ములుగు ప్రభుత్వ వైద్యశాలకు రిఫర్ చేస్తున్నారు. దాంతో బాలింతలు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన వస్తుంది. ఎక్రే, ఈసీజీ, వంటి సౌకర్యాలు లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల దృశ్య డెంగ్యూ మలేరియా వంటి జ్వరాలు వచ్చే అవకాశం ఉంది. దాంతో ప్రభుత్వ వైశాల్లో ఏజెన్సీ ప్రజలకు సరిపడా మందులు, వైద్యులను నియమించాలని లేనిపక్షంలో అఖిలభారత మహిళ తంత్ర మహిళా సంఘం తరఫున పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. బృందంలో మహిళా సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దేవేంద్ర, నాగలక్ష్మి జిల్లా కమిటీ సభ్యులు సాధన పెల్లి దేవి, మజా సుహాసిని, సునారికాని నిర్మల, నిమ్మకంటి స్రవంతి, సినిగిరి సత్యవతి, పుల్లరి యశోద, కురసం శారద, యాలం నాగమణి, రామోజీ సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ భద్రత కుదించడం అనైతికం

- ప్రశ్నించే గొంతుకలపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు.
- జిల్లా మాజీ అధ్యక్షులు గట్టు యాదవ్ ..



**వనపర్తి, జూలై 05 (జర్నలిస్ట్ ఫైల్) :** ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ భద్రత కుదించడం అనైతికమని జిల్లా మాజీ అధ్యక్షుడు గట్టు యాదవ్ అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రశ్నించే గొంతుకలపై కక్ష్య సాధింపు చర్యలను నిరసిస్తూ గట్టు యాదవ్ అధ్యక్షతన అంబేద్కర్ చౌరస్తాలో బిఆర్ఎస్ శ్రేణులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ .. రాష్ట్రంలో రెండున్నర ఏండ్లుగా అరాచక, అవినీతి పాలన కొనసాగిస్తుందని ఆరోపించారు. మాజీ ఐపీఎస్ అధికారి ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్, రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న అవినీతి, విధ్వంస పాలనను గొంతెత్తి నిలదీస్తుంటే మా అవినీతి ప్రజలలో తీవ్ర వ్యతిరేకతను తీసుకొస్తుందని తట్టుకోలేక ఏ విధమైన ముందస్తు సమాచారం లేకుండా ఉన్నఫళంగా భద్రతను తగ్గించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఐపీఎస్ అధికారిగా సుదీర్ఘ సేవలు రాష్టానికి అందించి శాంతి భద్రతలు కాపాడడానికి అసాంఘిక శక్తులతో తన ప్రాణాలు సహితం లెక్కచేయకుండా పోరాడిన ఉన్నతస్థాయి అధికారికి ప్రభుత్వం ఇస్తున్న గౌరవం ఇదేనా? అని ప్రశ్నించారు. వ్యక్తిగత కక్ష్యతో ప్రవీణ్ కుమార్ సతీమణి మహాలక్ష్మి ని కూడా ప్రాధాన్యత లేని శాఖకు బదిలీ చేయడం నీచమైన చర్య అని ఖండించారు. ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ కు ప్రభుత్వం రక్షణ కల్పించకపోయినా ప్రజలే కాపాడుకుంటారని ధీమా వ్యక్తం చేశారు. ఒకవేళ ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ కు ఎటువంటి ముప్పు వాటిల్లినా ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రుల సతీమణులు ఉన్నత స్థాయిలో ఉన్నా ఏనాడు వారిపై కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడలేదని గుర్తు చేశారు. అనంతరం జిల్లా ఎస్పి డి సునీత రెడ్డి కి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, మాజీ జెడ్.పి.టి.సి పద్మ వెంకటేష్, ధర్మా నాయక్, ప్రధాన కార్యదర్శి గంధం పరంజ్యోతి, మండల అధ్యక్షులు కె.మాణిక్యం, వనం రాములు, నాయకులు ఉంగ్లం తిరుమల్, జాత్రు నాయక్, దొడ్ల రాములు, విజయ్ కుమార్, కౌన్సిలర్స్ భారతి ప్రేమ్ నాథ్ రెడ్డి, ఏర్వ.అరుణ శ్రీనివాసులు, మాజీ కౌన్సిలర్స్ నాగన్న యాదవ్, స్టార్ రహీమ్ పాల్గొన్నారు.

## ఘనంగా దొడ్డి కొమురయ్య వర్ధంతి

- కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**పర్వతగిరి, జూలై 05 (జర్నలిస్ట్ ఫైల్) :** అమరవీరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని పురస్కరించుకుని శనివారం జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు. ఈ సందర్భంగా దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో దొడ్డి కొమురయ్య చేసిన త్యాగాలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి, అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్, డిబిసిడిఓ పుష్పలత, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొని అమరవీరుడు దొడ్డి కొమురయ్యకు నివాళులర్పించారు.

## భూముల రీ-సర్వే, ఎస్ఐఆర్‌పై గ్రామసభ అవగాహన సదస్సు

- భూ యజమానులందరూ అందుబాటులో ఉండాలి.
- తహసీల్దార్ టి. వెంకటస్వామి.



**పర్వతగిరి, జూలై 05 (జర్నలిస్ట్ ఫైల్) :** పర్వతగిరి మండలం జమాల్‌పురం గ్రామంలో భూముల రీ-సర్వే, ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించేందుకు శనివారం గ్రామ సర్పంచ్ జున్ను కనకయ్య ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ అసిస్టెంట్ డైరెక్టర్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్ హాజరై రీ-సర్వే ప్రక్రియ, భూ హద్దుల నిర్ధారణ, గ్రామ బౌండరీ ఫిక్సేషన్, గ్రామకంఠం, ప్రభుత్వ భూములు, వ్యవసాయ భూముల సమగ్ర సర్వే నిర్వహణ విధానంపై వివరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ టీ వెంకటస్వామి మాట్లాడుతూ, ఈనెల 6 నుంచి జమాల్‌పురం గ్రామంలో భూముల రీ-సర్వే కార్యక్రమం అధికారికంగా ప్రారంభమవుతుందని తెలిపారు. రీ-సర్వేలో భాగంగా గ్రామ బౌండరీ ఫిక్సేషన్, గ్రామకంఠం, ప్రభుత్వ భూములు, వ్యవసాయ భూముల సమగ్ర సర్వే నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భూ యజమానులందరూ సర్వే నిర్వహించే సమయంలో తమ భూముల వద్ద అందుబాటులో ఉండి, తాము సాగు చేస్తున్న భూముల హద్దులను సంబంధిత సర్వేయర్లకు చూపించి, అవసరమైన సహకారం అందించాలని ఆయన కోరారు. ప్రజల సహకారంతో రీ-సర్వే కార్యక్రమాన్ని పారదర్శకంగా, ఖచ్చితత్వంతో, నిర్ణీత గడువులో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ టి. వెంకటస్వామి, టెక్నికల్ సిబ్బంది, అడిషనల్ గిర్దావర్, మండల సర్వేయర్, జీపీఓ సోమారం, బీఎల్‌వోలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## నిర్మల్ కలెక్టరేట్‌లో దొడ్డి కొమురయ్య వర్ధంతి కార్యక్రమం



**నిర్మల్, జూలై 05 (జర్నలిస్ట్ ఫైల్) :** కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో శనివారం ఉదయం దొడ్డి కొమురయ్య వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆనాటి కాలంలో తెలంగాణ ప్రజలను బానిసత్వపు సంకెళ్ళ నుంచి బంధవిముక్తి చేసేందుకు పోరాటాలు చేశారని గుర్తుచేశారు. ఎంతో తెగువతో నిజాం నిరంకుశత్వాన్ని, దొరల ఆగడాలపై వ్యతిరేకంగా పోరాడారని చెప్పారు. ఇలాంటి మహనీయుల జయంతి, వర్ధంతుల కార్యక్రమాలు ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించడం గొప్ప విషయం అని తెలిపారు. దొడ్డి కొమురయ్య ఆశయాలను అందరూ కొనసాగించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ రాథోడ్ రమేష్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, అసిస్టెంట్ బిసి సంక్షేమఅధికారి సత్యనారాయణ, పలువురు సంఘాలనాయకులు, ఇతర అధికారులు, పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయుడు



**గద్వాల, జూలై 05 (జర్నలిస్ట్ ఫైల్) :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో ప్రతి అర్హులైన ఓటరు తప్పనిసరిగా ఎన్యుమరేషన్ ఫారాన్ని పూర్తి చేసి, సరైన వివరాలను నమోదు చేయాలని ఆలంపూర్ ఎమ్మెల్యే విజయుడు సూచించారు. శనివారం ఆలంపూర్ మున్సిపల్ కేంద్రంలో నిర్వహించిన ఎస్ఐఆర్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. బూత్ లెవల్ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మీ ఓటు మీ హక్కు. మీ భవిష్యత్తు అని పేర్కొంటూ, ఎలాంటి పొరపాట్లు లేకుండా ఎన్యుమరేషన్ ఫారాలను నింపాలని సూచించారు.

**కంటి అద్దాలు పంపిణీలో ఎమ్మెల్యే..**

అనంతరం మా బాప్ చారిటబుల్ ట్రస్ట్, సయ్యద్ అబ్దుల్లా షా ఖాద్రి సహకారంతో నిర్వహించిన కంటి అద్దాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయుడు పాల్గొని లబ్ధిదారులకు కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, బీఎల్ఓలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## మైనారిటీ విద్యార్థుల ప్రీ-మ్యాట్రిక్ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

**గద్వాల, జూలై 05 (జర్నలిస్ట్ ఫైల్) :** 2026-27 విద్యా సంవత్సరానికి 9వ, 10వ తరగతులు చదువుతున్న మైనారిటీ విద్యార్థుల నుంచి ప్రీ-మ్యాట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి అక్బర్ పాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 9వ, 10వ తరగతులు అభ్యసిస్తున్న అర్హులైన విద్యార్థులు ఎన్ఎస్‌పీ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ప్రక్రియలో భాగంగా ముందుగా NSP OTR App ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని, ఆధార్ నంబర్‌తో ఫేస్ ఐడీ ద్వారా 14 అంకెల ఓటీఆర్ నంబర్ పొందాలని తెలిపారు. అనంతరం ఆ ఓటీఆర్ నంబర్‌తో ఈ-పాస్ వెబ్‌సైట్‌లో ఫ్రెష్ లేదా రెన్యూవల్ దరఖాస్తును సమర్పించి, బయోమెట్రిక్ ధృవీకరణ పూర్తి చేయాల్సి ఉంటుందని వివరించారు. పాఠశాలల యాజమాన్యాలు ఈ-పాస్ పోర్టల్‌లో విద్యార్థుల దరఖాస్తులను పరిశీలించి వెరిఫికేషన్, స్క్రూటినీ పూర్తి చేసి, ప్రభుత్వ బీసీ, ఈబీసీ విద్యార్థుల దరఖాస్తులను జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారికి పంపించాలని సూచించారు. విద్యార్థులు దరఖాస్తుతో పాటు పాస్‌పోర్ట్ సైజు ఫోటో, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, కుల ధృవీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్, ఆదాయ ధృవీకరణ పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.50 లక్షల లోపు, పట్టణ ప్రాంత విద్యార్థులది రూ.2 లక్షల లోపు ఉండాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు అనంతరం అవసరమైన ధృవీకరణ పత్రాల హార్డ్ కాపీలను కలెక్టరేట్‌లోని బీసీ సంక్షేమ శాఖ కార్యాలయం లేదా జిల్లాలోని ఏదైనా బీసీ వసతిగృహ సంక్షేమ అధికారికి నేరుగా అందజేయాలని సూచించారు. అర్హత, మెరిట్ ఆధారంగా ఎంపికైన విద్యార్థులకు సంవత్సరానికి రూ.4,000 చొప్పున ప్రీ-మ్యాట్రిక్ స్కాలర్‌షిప్ మంజూరు చేయబడుతుందని తెలిపారు.

## టి యు డబ్ల్యూ జే (ఐ జేయు) మహా సభలను విజయవంతం చేయాలి




**సంగారెడ్డి, జూలై 05 (జర్నలిస్ట్ ఫైల్) :**
ఈనెల తొమ్మిదో తేదీ రోజు సంగారెడ్డిలో టి యు డబ్ల్యూ (ఐ జె యు) జిల్లా మహాసభలు విజయవంతం చేయడానికి సన్నాహక సమావేశాన్ని సదాశివపేట ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో బసవ సేవా సదన్ లో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా మహాసభకు అధిక సంఖ్యలో జర్నలిస్టులను తరలించి విజయవంతం చేయాలని టీయూడబ్ల్యూజే నాయకులు కోరారు.

## కిండర్‌బాట్స్ రోబోటిక్స్ ప్రీ స్కూల్ ప్రారంభించిన టీజీఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి

**సంగారెడ్డి, జూలై 05 (జర్నలిస్ట్ ఫైల్) :**
సదాశివపేట పట్టణంలోని గాంధీ చౌక్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన భారతదేశపు తొలి ఏఐ మరియు రోబోటిక్స్ ప్రీ స్కూల్ కిండర్‌బాట్స్ తన కొత్త బ్రాంచ్‌ను టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి చేతుల మీదుగా ఘనంగా ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ స్కూల్ డైరెక్టర్ సందీప్ ను ప్రశంసించడం జరిగింది. భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన ఆధునిక బాల్య విద్యను పట్టణంలోని చిన్నారులకు అందించడమే లక్ష్యంగా ఈ ప్రీ స్కూల్ ఏర్పాటు చేయడం మంచి ఆలోచన అని అన్నారు.ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ సందీప్ మాట్లాడుతూ 2 నుండి 6 సంవత్సరాల వయస్సు గల పిల్లల కోసం రూపొందించిన ఈ ప్రీ స్కూల్‌లో ఏఐ & రోబోటిక్స్ లెర్నింగ్, ఎస్ టీ ఈ ఎమ్ ఎడ్యుకేషన్, ఆటల ద్వారా అభ్యాసం ఎయిర్ కండీషన్డ్ క్లాస్‌రూమ్స్, ఆకర్షణీయమైన థీమాటిక్ క్లాస్‌రూమ్ డిజైన్స్ వంటి సదుపాయాలతో సురక్షితమైన, ఆనందకరమైన వాతావరణంలో విద్య అందించబడుతుందని,చిన్నారుల్లో సృజనాత్మకత, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం, విమర్శనాత్మక ఆలోచన మరియు సమస్యల పరిష్కార సామర్థ్యాలను చిన్న వయస్సు నుండే పెంపొందించే విధంగా ప్రత్యేకమైన కరికులమ్ రూపొందించబడన్నారు. ఒత్తిడి లేని విద్య అందించడమే కిండర్‌బాట్స్ లక్ష్యమని, ఆనందకరమైన అభ్యాసాన్ని ఆధునిక టెక్నాలజీతో కలిపి పిల్లలను భవిష్యత్తుకు సిద్ధం చేస్తామని తెలిపారు. ప్లే గ్రూప్, నర్సరీ, ఎల్‌కేజీ మరియు యూకేజీ తరగతులకు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని అడ్మిషన్స్ వివరాలకు మ్యానేజింగ్ డైరెక్టర్ జీర్లపల్లి సందీప్ మరియు స్వాతి సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ, వైస్ చైర్ పర్సన్ రేణుక చిరు, చింత సాయినాథ్, 23వ వార్డు కాంగ్రెస్ ఇంచార్జి కోడూరి శరత్ చంద్ర, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చాట్ల సిద్దన్న, మండల అధ్యక్షులు ఒగ్గు శ్రీనివాస్.



## విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ.



**ఏన్కూరు, జూలై 05 (జర్నలిస్ట్ ఫైల్) :**
ఏన్కూరు మండలం నాచారం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల శ్రేయస్సు కొరకు 10 సైకిళ్లను శనివారం ఎంఈఓ ఎన్ వాసవి దేవి చేతుల మీదిగా వితరణగా అందజేశారు. గంగుల నాచారం, కాలనీ నాచారం, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ సమీపంలోని విద్యార్థులు కాలినడకన రాలేక ఇబ్బంది పడుతున్నారు. ఇబ్బందుల దృష్ట్యా హెచ్ఎం నల్లపు రామకృష్ణ ఉపాధ్యాయులు సొంత డబ్బులతో రూ 60 వేల తో సైకిళ్లను కొనుగోలు చేసి బాల బాలికలకు అందజేశారు. సొంత డబ్బులతో విద్యార్థులకు సైకిళ్లు బహూకరించిన హెచ్ ఎం, ఉపాధ్యాయులను ఎం ఈ ఓ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో టి జి టి టి ఎఫ్ మండల అధ్యక్షుడు హతిరాం, విద్యా కమిటీ చైర్మన్ డి లక్ష్మి , ఉపాధ్యాయులు లలిత, ప్రసాద్, నరసింహారావు పాల్గొన్నారు.

## రైతు భరోసా సంబరాలు

**సంగారెడ్డి, జూలై 05 (జర్నలిస్ట్ ఫైల్) :**
శనివారం రోజున సదాశివపేట మండలంలోని వెంకటాపూర్ గ్రామ పంచాయతీ ఆవరణలో రైతు భరోసా డబ్బులు వేసినందుకు సీఎం రేవంత్ రెడ్డి గారికి వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు గార్ల కి చిత్రపటానికి పాలాభిషేకం చేసి మిఠాయి పంచడం జరిగింది ఈ కార్యక్రమంలో సదాశివపేట బ్లాక్ అధ్యక్షులు చాట్ల సిద్దన్న గారు,మండల పార్టీ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గు శ్రీనివాస్ గారు, పట్టణ అధ్యక్షుడు నాగరాజు గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ గారు, సర్పంచులు మాచిరెడ్డిపల్లి సర్పంచ్ మోహన్ గౌడ్, ఎంకేపల్లి సర్పంచ్ దుర్గాప్రసాద్, పొట్టి పల్లి సర్పంచ్ లక్ష్మయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మధుకర్ రెడ్డి, యూసుఫ్, ఉప సర్పంచ్ మహేందర్, మాజీ సర్పంచ్ ఏటిగడ్డ సంగం నర్సింలు, మాజీ వెంకటాపూర్ కృష్ణ, మాజీకోఆప్షన్ ఖలీల్, గ్రామ శాఖ అధ్యక్షులు సత్యనారాయణ, శ్రీనివాస్ రెడ్డి, విట్టల్ గౌడ్, బస్వరాజ్, మల్లేశం, పోచయ్య, లక్ష్మణ్, విజయ్ కుమార్, ప్రేమనందం, శ్రీకాంత్, శ్రీకాంత్, మల్లయ్య, లక్ష్మయ్య, రైతులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## ఓట్ల తొలిగింపు కాకుండా అప్రమతంగా ఉండాలి



**నేలకొండపల్లి, (జర్నలిస్ట్ ఫైల్) :** సర్ కార్యక్రమంలో ఓట్ల తొలిగింపు కాకుండా బీఎస్ఏ లు అప్రమతంగా ఉండాలని రాష్ట్ర రెవిన్యూ, గృహా నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయం ఇంచార్జీ తుంబూరు దయాకర్ రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని ఎస్సీ, బీసీ కాలనీ లో రేషన్ దుకాణం దూరం కావటంతో వార్డు సభ్యులు కొడిరెక్క వినోద్, మన్నె సుప్రజ లు మంత్రి కి ఫిర్యాదు చేశారు. స్పందించిన మంత్రి కాలనీ కి షిఫ్ట్ చేశారు. కాలనీ తో నూతనంగా ఏర్పాటు చేసిన దుకాణం ను శనివారం ప్రారంభించారు. కాలనీ వాసులు మంత్రి చిత్ర పటం కు పంచామృతములతో అభిషేకం చేశారు. కాలనీ లో మంచినీటి కొరత తో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఫిర్యాదు చేశారు. రూ.50 లక్షలతో వాటర్ ట్యాంక్ మంజూరు చేసినట్లు తెలిపారు. త్వరలోనే పనులు చేపడతారన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ పాఠశాల ను సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సర్ కార్యక్రమంలో ప్రతీ బీఎస్ఏ లు విధిగా పాల్గొనాలని సూచించారు. అర్హత ఉన్న ఒక్క ఓటు కూడ పోకూడదన్నారు. సరీ కార్యక్రమం పై ప్రతీ ఓటరు ను కలిసి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, నాయకులు శాఖమూరి రమేష్, బచ్చలకూరి నాగరాజు, అంజిని, బొడ్డు బొందయ్య, వెంకన్న, రాయపూడి నవీన్, పసుపులేటి శ్రీలత, యడవల్లి నాగరాజు, మన్నె నరేష్, కడియాల నరేష్, ఏడకొండలు, పసుపులేటి ఉపేందర్,నల్లాని మల్లిఖార్జునరావు, వార్డు సభ్యులు కొడిరెక్క వినోద్, మన్నె సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

## 18,19వ తేదీల్లో జరిగే తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర 3వ మహాసభలు జయప్రదం చేయండి

**ఖమ్మం, జూలై 05 (జర్నలిస్ట్ ఫైల్) :**
రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల్లో గిరిజన దివాసీల సమస్యలపై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని జూలై 18,19వ తేదీల్లో జరగనున్న తెలంగాణ రాష్ట్ర గిరిజన సమాఖ్య రాష్ట్ర 3వ మహాసభలు జయప్రదం చేయాలని తెలంగాణ రాష్ట్ర గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు అజ్మీరా రాంమూర్తి నాయక్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయం గిరిప్రసాద్ భవన్లో గిరిజన సమాఖ్య ఖమ్మం జిల్లా సమితి కార్యవర్గ సమావేశం బాణోతు రాంబాబు నాయక్ అధ్యక్షతన జరిగింది. ఈ సమయంలో గిరిజన సమాఖ్య జిల్లా ఇన్చార్జి మహ్మద్ మౌలానా, రాష్ట్ర అధ్యక్షులు అజ్మీరా రాంమూర్తి నాయక్ హాజరై మాట్లాడుతూ. ఆదివాసీ, గిరిజన, ప్రాంతాల్లో సమగ్ర అభివృద్ధికి నోచుకోలేదని కేంద్ర ప్రభుత్వం గిరిజనుల హక్కులను కాలరాస్తుందనీ, రాష్ట్ర ప్రభుత్వం అణిచివేస్తుందని గిరిజన, ఆదివాసీల హక్కులను పరిరక్షంచడం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. గిరిజనులకు మిగులు భూములకు పట్టాలు ఇవ్వాలని గత ప్రభుత్వ హయాంలో మంజూరైన లబ్ధిదారులకు ట్రైకార్ లోన్లకు బడ్జెట్ కేటాయించి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన గిరిజనులకు ఇందిరమ్మ ఇండ్లు, ఇండ్ల సలాలు ఇవ్వాలని తదితర డిమాండ్ల సాధన కోసం జూలై 18 19వ తేదీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండల కేంద్రంలో జరగనున్న తెలంగాణ రాష్ట్ర గిరిజన సమాఖ్య రాష్ట్ర 3వ మహాసభలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి బానోతు జగ్నాధం , గిరిజన సమాఖ్య రాష్ట్ర సమితి సభ్యులు బాణోతు భరత్, గిరిజన సమాఖ్య జిల్లా కార్యవర్గ సభ్యులు భూక్యా నర్సింహా, డుంగ్రోతు శేఖర్, కంపా అమరయ్య, గుగులోతు శ్రీను , శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.




## కట్టుకాచారం లో విద్యా ప్రవేశ్ ప్రారంభం

**నేలకొండపల్లి, జూలై 05 (జర్నలిస్ట్ ఫైల్) :**
మండలం లోని కట్టుకాచారం పాఠశాల లో శనివారం విద్యా ప్రవేశ్ కార్యక్రమం ను మండల విద్యాశాఖాధికారి బీ.చలపతిరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాల అంటే భయం పోగొట్టి ఆడుతూ, పాడుతూ బడికి అలవాటు చేసే కార్యక్రమం ను కొత్తగా ప్రవేశపెట్టిందన్నారు: 12 వారాల పాటు ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేయనున్నట్లు తెలిపారు. పిల్లల శారీరక, మానసిక వికాసం, సామాజిక భావోద్వేగం, ఎదుగుదల, ఆరోగ్యం, పరిశుభ్రత పై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారని తెలిపారు. పుస్తకాలతో పని లేకుండా మూడు నెలల పాటు ఇండోర్, అవుట్ డోర్ ఆటలు, బొమ్మలు గీయటం, మట్టితో వస్తువులు తయారు చేయించటం, చిన్న చిన్న కథలు చెప్పటం వంటి వాటి ద్వారా పిల్లలను భాగస్వాములను చేయనున్నట్లు తెలిపారు. విద్యా ప్రవేశ్ కార్యక్రమంప్రారంభం కు అవసరమైన మెటిరియల్ ను అందించిన ఉపాధ్యాయుడు ఇటిక్యాల సురేష్ ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నరేందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాందాసు, ఉపాధ్యాయులు కళ్యాణి, సురేష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



# మౌనంగా భరించొద్దు... మూత్రాశయ, పెల్విక్ ఫ్లోర్ సమస్యలకు చికిత్స ఉంది



**హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్) :** వయసు పెరిగేకొద్దీ మహిళల్లో కనిపించే మూత్రాశయ, పెల్విక్ ఫ్లోర్ సంబంధిత సమస్యలను మౌనంగా భరించకుండా ప్రారంభ దశలోనే వైద్యులను సంప్రదించాలని అపోలో ఆస్పత్రుల నిపుణులు సూచించారు. ఈ మేరకు జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రుల ప్రాంగణంలో శనివారం "ఏజింగ్ విత్ కాన్ఫిడెన్స్ – సొల్యూషన్స్ ఫర్ బ్లాడర్ అండ్ పెల్విక్ ఫ్లోర్ ప్రాబ్లమ్స్" పేరుతో ఒకరోజు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వృద్ధ మహిళలు, వారి కుటుంబ సభ్యులు, సంరక్షకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మూత్రం అదుపులో లేకపోవడం (యూరినరీ ఇన్‌కాంటినెన్స్), పెల్విక్ అవయవాలు జారిపోవడం (పెల్విక్ ఆర్గన్ ప్రోలాప్స్), మూత్రాశయ ఆరోగ్యం, ఆరోగ్యకరమైన వృద్ధాప్యం, పెల్విక్ ఫ్లోర్ కండరాల బలోపేతానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిపుణులు అవగాహన కల్పించారు. పాల్గొన్న వారికి ఉచితంగా బోన్ మినరల్ డెన్సిటీ (బీఎండీ), రక్తపోటు, రక్తంలో చక్కెర పరీక్షలు నిర్వహించడంతో పాటు ఫిజియోథెరపీ ప్రదర్శనలు, సందేహ నివృత్తి కార్యక్రమాలు నిర్వహించారు.యూరోగైనకాలజీ విభాగానికి చెందిన డా. నిర్మల పాపల్కర్, డా. శ్రీజ గుర్రాల, జీరియాట్రిక్ మెడిసిన్ నిపుణురాలు డా. ధర్షిత ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. న్యూరాలజీ, రుమటాలజీ, కార్డియాలజీ విభాగాల నిపుణులు కూడా పాల్గొని వృద్ధ మహిళల ఆరోగ్యానికి బహుళ విభాగాల సమన్వయ చికిత్స అవసరాన్ని వివరించారు.కార్యక్రమంలో పాల్గొన్న పలువురు మహిళలు మూత్రం లీక్ కావడం, పెల్విక్ ఫ్లోర్ సమస్యలు, మూత్రాశయ ఇబ్బందుల గురించి తొలిసారిగా బహిరంగంగా తమ అనుభవాలను పంచుకోవడం విశేషంగా నిలిచింది. సిగ్గు, సామాజిక అపోహలు, అవగాహన లోపం కారణంగా చాలా మంది మహిళలు చికిత్స ఆలస్యం చేస్తున్నారని వైద్యులు తెలిపారు. అనామక ప్రశ్నోత్తర కార్యక్రమం ద్వారా మహిళలు ఎలాంటి సంకోచం లేకుండా తమ సందేహాలను నివృత్తి చేసుకునే అవకాశం కల్పించారు.పెల్విక్ ఫ్లోర్, మూత్రాశయ సమస్యలు వృద్ధాప్యంలో సహజమని భావించి నిర్లక్ష్యం చేయరాదని, ప్రారంభ దశలోనే నిర్ధారణ, ఫిజియోథెరపీ, జీవనశైలి మార్పులు, ఆధునిక వైద్య చికిత్సలతో ఈ సమస్యలను సమర్థవంతంగా నియంత్రించవచ్చని నిపుణులు వివరించారు.ఈ సందర్భంగా అపోలో హాస్పిటల్స్ తెలుగు రాష్ట్రాల సీఈఓ శ్రీ తేజస్వి రావు వీరేపల్లి మాట్లాడుతూ, మహిళల్లో ఇలాంటి సమస్యలపై ఉన్న మౌనాన్ని చెరిపివేయడం, అవగాహన పెంచడం, ప్రారంభ దశలోనే వైద్య సేవలు అందుకునేలా ప్రోత్సహించడం కోసం అపోలో ఆస్పత్రులు నిరంతరం ప్రజా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. మహిళలు ఆత్మవిశ్వాసంతో, ఆరోగ్యంగా వృద్ధాప్యాన్ని గడపాలన్నదే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు.

# బీఆర్ఎస్ పార్టీ సంగారెడ్డి పట్టణ మాజీ అధ్యక్షులు శ్రీనివాస చారికి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ నివాళి

**సంగారెడ్డి, జూలై 05 (జర్నలిస్ట్ ఫైల్) :**



బీఆర్ఎస్ పార్టీ సంగారెడ్డి పట్టణ మాజీ అధ్యక్షులు శ్రీనివాస చారి ఈరోజు ఉదయం స్వర్గస్తులయ్యారు. ఈ విషాద వార్త తెలుసుకున్న సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ వెంటనే సంగారెడ్డి పట్టణంలోని 35వ వార్డు, సాయిబాబా కామన్, పాత ఇంటి వద్దకు చేరుకుని శ్రీనివాస చారి గారి పార్థివదేహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.అనంతరం దుఃఖసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా శ్రీనివాస చారి పార్టీ అభివృద్ధికి, ప్రజా సేవకు చేసిన కృషిని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ స్మరించుకున్నారు. పార్టీ పట్ల ఆయన చూపిన అంకితభావం, నిబద్ధత, కార్యకర్తలతో ఆయనకు ఉన్న అనుబంధం చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన మరణం బీఆర్ఎస్ పార్టీకి, సంగారెడ్డి పట్టణానికి తీరని లోటని ఎమ్మెల్యే అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్లు కాసాల బుచ్చిరెడ్డి, విజేందర్ రెడ్డి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరి రెడ్డి, మాజీ కౌన్సిలర్ జీవీ శ్రీనివాస్, చేర్యాల ప్రభాకర్, కొండల్ రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఆర్. వెంకటేశ్వర్లు, పట్టణ కార్యదర్శి పీ. నర్సింలు, కౌన్సిలర్ జలేందర్, శ్రవణ్ రెడ్డితో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొని శ్రీనివాస చారి గారికి నివాళులర్పించారు.


# టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సహకారంతో 12వ వార్డు అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించిన పులిమామిడి రాజు

**సంగారెడ్డి, జూలై 05 (జర్నలిస్ట్ ఫైల్) :**



సదాశివపేట పట్టణంలోని 12వ వార్డును అన్ని రంగాల్లో పట్టణంలోనే ఆదర్శవంతమైన వార్డుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పులిమామిడి మమత రాజు తెలిపారు. టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సహకారంతో వార్డులో అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు.12వ వార్డులో తాగునీటి సరఫరా, అంతర్గత సీసీ రోడ్లు, యూడీసీ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, వీధి విద్యుత్ దీపాలు, ఐమాక్స్ లైట్లు, పారిశుద్ధ్య నిర్వహణ, పచ్చదనం పెంపు వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ప్రజలకు అవసరమైన ప్రతి సమస్యను గుర్తించి దశల వారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హులైన లబ్ధిదారునికి చేరేలా నిరంతరం కృషి చేస్తామని అన్నారు.ప్రజల సహకారంతో 12వ వార్డును ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాల అమలులో ప్రజల సూచనలు, సలహాలకు ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు.12వ వార్డు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు అంకితభావంతో పనిచేస్తామని, టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గన్న మార్గదర్శకత్వంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని పులిమామిడి మమత రాజు స్పష్టం చేశారు. ఇట్టి కార్యక్రమంలో మున్సిపల్ వర్క్ ఇన్స్పెక్టర్ వైద్యం ప్రసాద్, గణేష్, 12వ వార్డు ప్రజలు జబ్బార్, ఫహీం, చోటు, రాము, అనిల్, గుణాకర్, పాశ పటేల్, రామ స్వామి, రాఘవేందర్, పోల గణేష్, సోమ శంకర్, గోనె క్రిష్ణ, చింతకింది హన్మంతు మొదలగు వారు పాల్గొన్నారు.

# కుల్కచర్ల పీఏసీఎస్ నూతన పాలకవర్గం బాధ్యతల స్వీకారం



**వికారాబాద్, జూలై 05 (జర్నలిస్ట్ ఫైల్) :**

రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పని చేస్తామని కుల్కచర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నూతన చైర్మన్ బొలుసాని భీంరెడ్డి స్పష్టం చేశారు. సహకార సంఘం రైతులకు అండగా నిలిచి సమర్థవంతమైన సేవలు అందించేందుకు కట్టుబడి ఉంటామని తెలిపారు.కుల్కచర్ల పీఏసీఎస్ నూతన పాలకవర్గం బాధ్యతల స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా బొలుసాని భీంరెడ్డి చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయగా, ఎల్పటి అశోక్ కుమార్ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. డైరెక్టర్లు కూడా తమ బాధ్యతలను స్వీకరించారు.ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు రైతు సంక్షేమం కోసం సహకార సంఘం కీలక పాత్ర పోషించాలని, రైతులకు అవసరమైన రుణాలు, ఎరువులు, విత్తనాలు సమయానికి అందేలా కృషి చేయాలని సూచించారు. రైతుల అభ్యున్నతికి సంఘం మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, కుల్కచర్ల మండల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, రైతులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 12వ వార్డులో SIR సర్వే కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పులిమామిడి రాజు

## - బాలికల పాఠశాలను సందర్శించిన ఆడిటర్



**సంగారెడ్డి, (జర్నలిస్ట్ ఫైల్) :** సదాశివపేట పట్టణంలోని 12వ వార్డులో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా నిర్వహిస్తున్న SIR (సర్) కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పులిమామిడి రాజు పాల్గొన్నారు. పులిమామిడి రాజు ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిసి ఎన్యూమరేషన్ ఫామ్స్ అందరికి అందుతున్నాయా అన్న సమాచారాన్ని బి ఎల్ ఓలకు బిఎల్ఎ లకు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా తాను కూడా వారితో కలిసి వార్డు ప్రజలకు ఎన్యూమరేషన్ ఫామ్స్ స్వయంగా అందజేశారు. ఇట్టి ప్రాముఖ్యతను 12వ వార్డు ప్రజలకు వివరిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా పులిమామిడి రాజు మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిజమైన లబ్దిదారులకు చేరేలా SIR సర్వే ఎంతో కీలకమని అన్నారు. ప్రజలు అధికారులకు పూర్తిగా సహకరించి సర్ (SIR) ను విజయవంతం చేయాలని ప్రజలను కోరారు. మీకు ఇచ్చిన ఫామ్స్ ను జాగ్రత్తగా తప్పులు లేకుండా నింపి మీకు అందించిన బిఎల్ఓ లకు అందించి రిటర్న్ ఫామ్ ను తీసుకోవలసిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎవరికైనా ఫామ్స్ నింపడానికి ఇబ్బందిగా ఉంటే, వారికి నింపడానికి ప్రతేక బృందాన్ని పి ఎమ్ ఆర్ గణేష్ మండపంలో జులై 10వ తేది నుండి ఏర్పాటు చేస్తానని ప్రజలకు తెలియపరిచారు. ఫారంలు నింపే విషయంలో ఎవ్వరు ఇబ్బంది పడొద్దని ఇట్టి విషయాన్ని 12వ వార్డు ప్రజలకు తెలియజేయాలని కార్యకర్తలకు సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, వార్డు నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# SIR లో ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణకు పిలుపు

**ఖమ్మం, జూలై 05 (జర్నలిస్ట్ ఫైల్) :**



ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (SIR) కార్యక్రమంలో భాగంగా పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను సంబంధిత ధ్రువ పత్రాలతో కలిసి ఈ నెల 31లోగా బీఎల్వో లకు సమర్పించాలని తహశీల్దార్ టి.శాంత సూచించారు.2002 జనవరి 1కు ముందు ఓటరుగా నమోదైన వారందరూ తప్పనిసరిగా ఫారం సమర్పించాలని తెలిపారు. ఓటరు వివరాల్లో మార్పులు లేదా సవరణలు ఉంటే వాటిని కూడా నమోదు చేయాలని సూచించారు.అంతే కాకుండా ధర్పల్లి గ్రామ ప్రజలకు ఓటర్ జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాలను ఆదివారం ఉదయం 10:00 గంటలకు జిల్లా పరిషత్ పాఠశాలలో ఎన్యూమరేషన్ ఫారాలను నింపడం కోసం తహసీల్దార్ గారు మరియు గ్రామ పంచాయతీ పాలకవర్గం గారి ఆధ్వర్యంలో ఫారాలను నింపడానికి వాలంటీర్స్ వాళ్ళను పెట్టడం జరుగుతుంది కావున ఈ కార్యక్రమంలో ధర్పల్లి ప్రజలందరూ పాల్గొనవలసినదిగా కోరడం జరుగుతుంది.

## పిజిఆర్ఎస్‌ను ప్రజలు వినియోగించుకోవాలి

- పి.జి.ఆర్.ఎస్ టోల్ ఫ్రీ నంబర్ 1100
- టోల్ ఫ్రీ నంబర్ కు ఫోన్ చేసి ఆర్జీల వివరాలు తెలుసుకోవచ్చు



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్)ను ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ కోరారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గల ఎస్.ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో పి.జి.ఆర్.ఎస్ తో పాటు రెవెన్యూ క్లినిక్ లను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మీకోసం వెబ్ సైట్ Meekosam.ap.gov.in(మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) లో కూడా అర్జీలు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పి.జి.ఆర్.ఎస్ కు ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 1100 ను వినియోగించుకొని, ఆర్జీల పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చని సూచించారు.

## మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళి



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 129వ జయంతి సందర్భంగా శనివారం బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన దేశభక్తి, త్యాగస్ఫూర్తిని స్మరించుకున్నారు.

ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి దొరబాబు మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమరంలో అల్లూరి సీతారామరాజు చేసిన త్యాగాలు భావితరాలకు ఆదర్శమని అన్నారు. యువత ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని దేశాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో స్పైసెస్ బోర్డు డైరెక్టర్ కె.వి. సుబ్బారావు, జిల్లా ఉపాధ్యక్షుడు సాధు రామకృష్ణ, జిల్లా కార్యదర్శి సురేష్ కుమార్, జెన్ ఆంజనేయస్వామి ఆలయ డైరెక్టర్ జగదీష్, పోతురాజు వెంకట్, శివాలయ ఆలయ డైరెక్టర్ అనిల్, యువమోర్చా నాయకుడు శశాంక్, వివిధ మండలాల అధ్యక్షులు, స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బ్రహ్మంగారి స్వామి నివాస గృహంనకు చందా అందజేత



బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్):భూత భవిష్యత్ వర్తమాన కాలజ్ఞానాన్ని రచించిన జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కందిమల్లాయపల్లెలో నివాసం చేసిన గృహ పున: నిర్మాణమునకు ప్రకాశం జిల్లా, వలేటివారిపాలెం మండలం సింగమనేని పల్లె గ్రామ వాస్తవ్యులు అయిన పునాటి రమేష్ ధర్మపత్ని రమాదేవి గార్లు తమ వంతు సాయంగా 2,00,016 రెండు లక్షల పదహారు రూపాయలను మఠం కార్యాలయంలో సిబ్బంది వేణు గోపాల్, సుబ్బారాయుడు, శ్రీనివాసులకు నగదు అందజేశారు. వారికి మఠాధిపతులు శ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వామి వారి ఆజ్ఞ మేరకు ఆలయ మర్యాదలతో శేష వస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఎవరైనా భక్తులు నివాస గృహ పునం: నిర్మాణం నకు భాగస్వాములు కావాలనుకున్న వారు మఠం కార్యాలయం లో సంప్రదించండి అని తెలిపారు.

## మహా గురుకులంలో విద్యార్థుల సమస్యలకు పరిష్కారమెక్కడా?



- సిపిఐ మండల కార్యదర్శి పెద్దలపల్లి ప్రభాకర్

బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్): మహా గురుకులంలో రెండవ విద్యా సంవత్సరం ప్రారంభమైన విద్యార్థుల వసతులపై జిల్లా అధికారుల నిర్లక్ష్యం వీడలేదని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ సిపిఐ మండల కార్యదర్శి పెద్దలపల్లి ప్రభాకర్ పేర్కొన్నారు. గత విద్యా సంవత్సరం ప్రారంభంలో ఎంతో అట్టహాసంగా ప్రారంభం చేసిన మహా గురుకులం రెండవ విద్యా సంవత్సరం ప్రారంభమైన కూడా అక్కడ ఉంటున్న విద్యార్థులకు సరైన వసతులు కల్పించకుండా వారి సమస్యలు పరిష్కరించకుండా అక్కడ పనిచేస్తున్న ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం వహిస్తూ విద్యార్థుల సమస్యలను గాలికోదిలారని వారు పేర్కొన్నారు. విద్యార్థుల మౌలిక వసతులైన త్రాగడానికి సరైన నీటి సదుపాయం లేకుండా అదే విధంగా స్నానం చేయడానికి నీరు మరియు మరుగుదొడ్లు అపరిశుభ్రంగా మరుగుదొడ్లల్లోకి నీరు సరఫరా ఆగిపోయిన విద్యార్థుల బాగోగులు చూడాల్సిన ప్రిన్సిపల్ కనీసం విద్యార్థుల మౌలిక వసతులపై చర్యలు తీసుకోకుండా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ అక్కడ విద్యార్థుల పరిస్థితిని పట్టించుకునే నాథుడే లేడని వారు ఆరోపించారు. మహా గురుకులంలో ఈ విద్యా సంవత్సరం విద్యార్థులు భారీ స్థాయిలో పెరిగారని దాదాపు 800 పైగా విద్యార్థులు ఉన్నారని అందులో 300 పైచిలుకు కొత్త విద్యార్థులు చేరారని అయితే అక్కడ విద్యార్థులకు సరిపడా తరగతి గదులు హాస్టల్ వసతి లేకపోవడంతో చాలామంది విద్యార్థులు వేణుదిరిగి వెళున్నారని తక్షణమే పాత గురుకుల పాఠశాల విద్యార్థులను పాత గురుకుల పాఠశాలకు తరలించి ఈ విద్యా సంవత్సరం వచ్చిన విద్యార్థులను మహా గురుకులంలో ఉంచి భవిష్యత్తులో విద్యార్థుల సంఖ్యను పెంచే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. పాత గురుకులంలో ఉన్న విద్యార్థులను మహా గురుకులంలోకి తరలించడంతో సరైన సిబ్బంది, వర్కర్లు కొరతతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. తక్షణమే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారు బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలో ఉన్న పాత గురుకులాన్ని ఈ విద్యా సంవత్సరంలో యధావిధిగా కొనసాగించి మహా గురుకులంకి కొత్త అడ్మిషన్లు చేర్చుకొని స్కూలును అభివృద్ధి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గుడిమె సురేష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి కుటుంబం వారానికి ఒక రోజు ప్లాస్టిక్‌కు దూరంగా ఉండాలి - ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :ప్రతి కుటుంబం వారానికి కనీసం ఒక రోజు ఒకసారి వినియోగించే ప్లాస్టిక్ వస్తువులకు పూర్తి దూరంగా ఉండాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు. ఆదివారం గుంటూరు 38వ డివిజన్ గుజ్జనగుండ్ల పార్క్ సమీపంలో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన “లెస్ ప్లాస్టిక్ -- మోర్ గ్రీన్” కార్యక్రమానికి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ, సామాజిక బాధ్యత పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ శ్యామల నగర్ రైల్వే వద్ద ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం సాధారణ పౌరుడిగా ప్రభాకర్ చేస్తున్న సేవలను ప్రత్యేకంగా అభినందించారు. రాంగ్ రూట్‌లో వాహనాలు రాకుండా స్వయంగా గంటల తరబడి నిలబడి ప్రజలకు అవగాహన కల్పిస్తూ ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఆయన చేస్తున్న కృషి ఆదర్శనీయమని పేర్కొన్నారు. సామాజిక బాధ్యతతో ఒక వ్యక్తి ముందుకు వస్తే సమాజంలో ఎంతటి మార్పు తీసుకురాగలడో ప్రభాకర్ నిరూపించారని అన్నారు.

సామాజిక మాధ్యమాల ద్వారా ఆయన చేపట్టిన కార్యక్రమాన్ని చూసిన తరువాత ఎంతో స్ఫూర్తి పొందానని, ఇదే విధంగా ప్లాస్టిక్ నిర్మూలన కోసం కూడా ప్రజలు ముందుకు రావాలని కోరారు. అవగాహన లోపం, నిర్లక్ష్యం కారణంగా ప్లాస్టిక్ వినియోగం విపరీతంగా పెరిగిపోయిందని, నేడు ప్లాస్టిక్ లేని ఇల్లు లేదా ప్రాంతం కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో డ్రైన్ల శుభ్రపరిచే కార్యక్రమాల్లో భారీగా ప్లాస్టిక్ వ్యర్థాలు బయటపడుతున్నాయని తెలిపారు. కేవలం కొన్ని డ్రైన్ల శుభ్రపరిచే పనుల్లోనే రెండు నుండి నాలుగు టన్నుల వరకు ప్లాస్టిక్ వ్యర్థాలు వెలికితీయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇళ్లలో నుంచే నిర్లక్ష్యంగా ప్లాస్టిక్‌ను ఖాళీ స్థలాలు, కాలువలు, డ్రైన్లలో వేయడం వల్ల డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతింటోందని, వర్షాకాలంలో నీటి నిల్వలు, ముంపు సమస్యలకు ఇదే ప్రధాన కారణమని వివరించారు.

ప్లాస్టిక్ రహిత రాష్ట్రం, ప్లాస్టిక్ రహిత ప్రపంచం సాధించాలంటే ప్రభాకర్ లాంటి లక్షలాది మంది సామాజిక బాధ్యతతో ముందుకు రావాలని పేర్కొన్నారు. ఒక సాధారణ పౌరుడు ప్రారంభించిన ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజలు, యువత, చిన్నారులు విశేష స్పందన ఇవ్వడం ఎంతో సంతోషకరమని అన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న పిల్లలు, మహిళలు, స్థానిక ప్రజలు తమ ఇళ్లలో వినియోగించిన ప్లాస్టిక్ సీసాలు, కవర్లు మరియు ఇతర ఒకసారి వినియోగించే ప్లాస్టిక్ వస్తువులను తీసుకువచ్చి అప్పగించడం అభినందనీయమన్నారు. ప్లాస్టిక్ తీసుకువచ్చిన వారికి మొక్కలు అందించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రోత్సాహం కల్పించడం మంచి ఆలోచన అని కొనియాడారు.

కూరగాయలు, పూలు, నిత్యావసర వస్తువుల కోసం ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని తగ్గించి ప్రత్యామ్నాయ సంచులను ఉపయోగించాలని కోరారు. అలాగే ఇంట్లో ప్రత్యేకంగా ప్లాస్టిక్ వ్యర్థాల కోసం ఒక చెత్త బుట్ట ఏర్పాటు చేసి వాటిని వేరుగా సేకరించి మున్సిపల్ సిబ్బందికి అందిస్తే వ్యర్థాల నిర్వహణ మరింత సులభమవుతుందని చెప్పారు.

ఈ కార్యక్రమంలో అందజేసిన మొక్కలను ప్రతి ఒక్కరూ పెద్ద వృక్షాలుగా పెంచి సంరక్షించాలని, పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ఒక్క ప్రాంతానికే పరిమితం కాకుండా గుంటూరు పశ్చిమ నియోజకవర్గమంతా విస్తరించాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషి చేసిన ప్రభాకర్, ఆయన బృందం, స్వచ్ఛంద సేవకులు, స్థానిక ప్రజలు మరియు ప్లాస్టిక్ వ్యర్థాలు తీసుకువచ్చి కార్యక్రమంలో భాగమైన ప్రతి ఒక్కరికీ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలకు తన పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని ఆమె హామీ ఇచ్చారు.

## ఎస్.ఐ.ఆర్‌కు సమయం లేదు.. ప్రజలు సహకరించాలి

- అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పనే లక్ష్యం
- ఎన్యూమరేషన్ ఫారాలు పూర్తి చేసి అందించండి
- సందేహాలు ఉంటే బీఎల్వోలు, బీఎల్ఏలను సంప్రదించండి
- పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్ కార్యక్రమానికి అతి తక్కువ సమయం ఉన్నందున ప్రజలందరూ స్వయంగా సహకరించాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆర్టీసీ కాలనీ లోని బుర్ర నాగేశ్వరరావు గవర్నమెంట్ స్కూల్, సెయింట్ లారెన్స్ స్కూల్ లో సర్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నసీర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్దకు వచ్చిన ఓటర్లతో ఎమ్మెల్యే మాట్లాడారు. ఓటర్లందరూ ఎన్నికల జాబితాలో తమ ఓటు ఉందో లేదో పరిశీలించుకోవాలని సూచించారు. అదే విధంగా అప్పటి జాబితాలో తమ కుటుంబ సభ్యుల పేర్లను చూసుకోవాలన్నారు. బూత్ లెవెల్ అధికారులు ఇంటింటికీ తిరిగి అందజేసిన ఎన్యూమరేషన్ ఫారాలను గతంలో ఎక్కడ ఓటు హక్కు వినియోగించుకున్నారో గుర్తించి నమోదు చేయాలని సూచించారు.

ఎన్యూమరేషన్ ఫారాలను ఎలా పూర్తి చేయాలో తెలియకపోతే బూత్ లెవెల్ అధికారులు, బీఎల్ఏల సహకారం తీసుకోవాలన్నారు. ఎన్యూమరేషన్ ఫారాలను నింపడంతో జాగ్రత్త వహించాలని చెప్పారు. బంధువులు ఎవరైనా ఇక్కడే నివాసముంటూ ఏదైనా ఊర్లకు వెళితే వారికి సమాచారం ఇవ్వాలన్నారు. ఇప్పటికే సర్ కార్యక్రమంపై గుంటూరు కార్పొరేషన్ అధికారులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారని, ప్రత్యేక క్యాంపుల ద్వారా ఓటరు మ్యాపింగ్ అవకాశం కల్పిస్తున్నారని తెలిపారు.

సర్ కార్యక్రమంపై ప్రజలకు ఎలాంటి అపోహలు అవసరం లేదని, స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు ఎన్నికల సంఘం చర్యలు చేపట్టిందని చెప్పారు. సర్ పై ప్రజలకు ఎలాంటి సందేహాలు ఉన్నా బీఎల్ ఏలు అందుబాటులో ఉంటారని తెలిపారు.

## ది పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మెరిట్ స్కాలర్షిప్ పంపిణీ



తెనాలి (జర్నలిస్ట్ ఫైల్): పట్నంలోని ముత్యంశెట్టి పాలెం లో ఉన్న ది పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ కార్యాలయంలో సొసైటీ నిర్వాహకులు 111 మంది విద్యార్థులకు మెరిట్ స్కాలర్షిప్లను మరియు ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు చదివే290 మంది విద్యార్థిని విద్యార్థులకు నోట్ బుక్స్ ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి సొసైటీ అధ్యక్షులు జొన్నాదుల నరసింహారావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా ఏపీ ఎస్పీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అక్కల సత్యనారాయణ, పట్టణ 3 టౌన్ సీఐ సాంబశివరావు, పెద్ద బాలశిక్ష రచయిత గాజుల సత్యనారాయణ, ఏపీ పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నాదుల మహేష్, కెనరా బ్యాంకు రిటైర్డ్ అసిస్టెంట్ మేనేజర్ ఆదినారాయణ లో పాల్గొని విద్యార్థిని, విద్యార్థులకు విద్య యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి బీజేకే నరేంద్రబాబు, ఉపాధ్యక్షులు అక్ర శ్రీ రామ్, కోశాధికారి దివి పురుషోత్తం, పంచుమర్తి భాస్కరరావు,దామర్ల పరమేశ్వరరావు,కటకం శేషగిరి,దివి హేమంత్కుమార్, పడవల విద్యాసాగర్, టీవీ కృష్ణారావు, రాచబత్తిని శ్రీనివాసరావు, దామర్ల మదన మోహన్ రావు, కోసం శంకర్రావు, అక్కల రామలింగేశ్వరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మంగారిమఠంలో మెహబ్బత్ సినిమా చిత్రీకరణ



బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్):కడప జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని బ్రహ్మ సాగర్ నందు శనివారం సినిమా షూటింగ్ చిత్రీకరించడం జరిగింది. షూటింగ్ ని తిలకించేందుకు మండల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. షూటింగ్లో నటించే నటి నటులతో సెల్ఫీ లతో స్థానికులు హోరెత్తించారు. చుట్టూ పచ్చటి కొండలు మధ్యలో బ్రహ్మసాగర్ డ్యామ్ పై గాలిమర ఫ్యాన్లు బ్రహ్మసాగర్ లో నీటి సవ్వడి మఠానికే కొత్తదనాన్ని తీసుకువచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం బ్రహ్మంగారిమఠం మండలం పై పర్యాటకంగా ప్రత్యేక దృష్టి పెట్టినట్లయితే మరింత అభివృద్ధి జరుగుతుంది. సంవత్సరాలగా రోడ్డుకు నోచుకోని బ్రహ్మం సాగర్ డ్యాం పై కూటమి ప్రభుత్వంలో రోడ్డు వేయడంతో స్థానికులు పర్యాటకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిరోజు ఉదయం సాయంత్రం ఉద్యోగస్తులు యువత మహిళలు వాకింగ్ చేసేందుకు డ్యాం పై అధిక సంఖ్యలో రావడం విశేషం. స్థానిక ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ సొంత మండలం పై ప్రత్యేక చొరవ చూపి బోటింగ్ సౌకర్యం చిల్డ్రన్ పార్క్ ఏర్పాటు చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని మండల ప్రజలు పర్యాటకులు కోరుతున్నారు.

## ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని పరిశీలించిన అధికారులు



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) : జిల్లాలో ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని అధికారులు ఆదివారం పరిశీలించారు. ఓటరు ప్రత్యేక సవరణ (ఎస్.ఐ.ఆర్) కార్యక్రమంలో భాగంగా పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని జిల్లాలో చేపట్టడం జరిగింది. బూత్ స్థాయి అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద లభ్యంగా ఉండి ఓటరు నమోదు ఫారాలను తీసుకోవడం, ఓటరుకు ఉన్న సందేహాల నివృత్తిని చేయడం జరిగింది.

ఎస్.ఐ.ఆర్ ప్రత్యేక అధికారులుగా కొనసాగుతున్న జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్ ఫిరంగిపురం మండలంలో, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్ మంగళగిరి మండలంలో, జిల్లా విద్యా శాఖ అధికారి డా. షేక్ సలీం భాషా గుంటూరు పట్నంలో, మిగిలిన అధికారులు ఆయా మండలాల్లో విస్తృతంగా పర్యటించి ఓటర్ నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రజలకు ఎస్ఐఆర్ పై సందేహాలను నివృత్తి చేశారు. బూత్ స్థాయి అధికారులు చేపడుతున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు.

ఎన్యుమరేషన్ ఫారాలను బూత్ స్థాయి అధికారి లేదా ఎన్నికల సంబంధిత సిబ్బంది మాత్రమే ఇంటింటికి వెళ్లి అందించాలని అన్నారు. అయితే ఫారాలను బిఎల్ఓ తో పాటు బిఎల్ఏ కూడా సేకరించి అందించవచ్చని స్పష్టం చేశారు. ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ వేగవంతం చేయాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో ఉంటారని అన్నారు. 2002 సంవత్సరం నాటి ఓటరు జాబితాతో మ్యాపింగ్ చేయడం జరుగుతుందని తెలిపారు. 2002 సంవత్సరం ఓటరు జాబితాలో లేనప్పటికీ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సంబంధిత వివరాలను పక్కాగా అందించడం వలన ఓటరుగా కొనసాగుతారని అన్నారు. ఏన్యుమరేషన్ ఫారాలలో వివరాలను ఓటరు నింపి, సంతకం చేసి ఇవ్వాలని అన్నారు. జూలై 14వ తేదీ వరకు కొనసాగుతుందని చెప్పారు. ఎన్యూమరేషన్ ఫారాలు అందని వారు

బుక్ ఎ కాల్ విధానంలో బి.ఎల్.ఓతో మాట్లాడితే ఫారాలు అందిస్తారని చెప్పారు. సంతకం చేయని ఫారాలను వెనుకకు పంపించడం జరుగుతోందని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారాలు పూర్తి చేయుటకు అవసరమైతే అధికారుల సహాయం పొందవచ్చని తెలిపారు. బూత్ స్థాయి ఏజెంట్లను నియమించాలని రాజకీయ పార్టీలను కోరారు. ఈ కార్యక్రమంలో మండలాల తాహాసిల్దార్ లు, సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రపతి ఉత్తర్వులు-2025 అమలులో హడావుడి వద్దు

- పెండింగ్ పదోన్నతుల అనంతరమే అమలు చేపట్టాలి: ఏపీ జేఏసీ అమరావతి

అమరావతి/విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్): రాష్ట్రపతి ఉత్తర్వులు--2025 అమలు ప్రక్రియలో ప్రభుత్వం తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా ఉద్యోగుల హక్కులు, సీనియారిటీ, పదోన్నతులు, సేవా ప్రయోజనాలకు పూర్తి రక్షణ కల్పించాలని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సభ్య సంఘాల ప్రతినిధుల బృందం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ (జీఏడీ) ఎస్.ఎస్. రావత్‌ను కలిసి శాఖాపరమైన సంఘాల తరఫున పలు కీలక సూచనలు, వినతిపత్రాన్ని సమర్పించింది. రెవెన్యూ, పోలీసు, ఆర్టీసీ, మున్సిపల్, సహకార, కార్మిక శాఖలతో పాటు అనేక విభాగాల్లో సాంకేతిక, పరిపాలనా, న్యాయపరమైన కారణాలతో పదోన్నతులు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నాయని వారు పేర్కొన్నారు. కొన్ని కేడర్లలో ప్యానెల్లు కూడా సిద్ధం కాలేదని, అందువల్ల అప్‌డేటెడ్ ప్యానెల్ ఇయర్లకు సంబంధించిన పెండింగ్ పదోన్నతులను పూర్తిచేసిన అనంతరమే రాష్ట్రపతి ఉత్తర్వుల అమలు చేపట్టాలని కోరారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో ఇంటిగ్రేటెడ్ సీనియారిటీ జాబితాలు, అప్‌డేటెడ్ ప్యానెల్లు సిద్ధం చేసిన తర్వాతే తదుపరి ప్రక్రియ చేపట్టాలని సూచించారు. కొత్త జోన్లు, మల్టీ జోన్లకు సంబంధించిన డ్రాఫ్ట్ సీనియారిటీ, కేటాయింపు జాబితాలపై అభ్యంతరాలు తెలిపేందుకు కనీసం 15 రోజుల గడువు ఇవ్వాలని, వచ్చిన అభ్యంతరాలు, అప్పీల్స్‌ను పూర్తిగా పరిష్కరించిన తర్వాతే తుది కేటాయింపులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఏ ఉద్యోగికీ సీనియారిటీ, పదోన్నతులు, వేతనాలు, వార్షిక ఇంక్రిమెంట్లు, పెన్షన్ తదితర సేవా ప్రయోజనాల్లో నష్టం కలగదనే హామీని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాలని, భార్యాభర్తలు ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులైన వారు, వికలాంగులు, తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న ఉద్యోగులు, వితంతువులకు ప్రత్యేక రాయితీలు కల్పించాలని కోరారు.

రాష్ట్రపతి ఉత్తర్వుల అమలులో హడావుడిగా ముందుకు వెళితే వేలాది మంది ఉద్యోగులు నష్టపోయే అవకాశంతో పాటు న్యాయపరమైన వివాదాలు పెరిగే ప్రమాదం ఉందని నాయకులు పేర్కొన్నారు. ప్రస్తుతం జూలై 5 వరకు అమల్లో ఉన్న పదోన్నతుల నిషేధాన్ని ఆగస్టు 31, 2026 వరకు పొడిగించి, ఆలోపు అన్ని శాఖల్లో పెండింగ్ పదోన్నతులు పూర్తిచేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి ఉత్తర్వుల అమలుకు 27 నెలల గడువు కల్పించినందున, ఉద్యోగుల హక్కులకు భంగం కలగకుండా సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగాలని బొప్పరాజు వెంకటేశ్వర్లు, పలిశెట్టి దామోదరరావు, టి.వి. ఫణిపేర్రాజు, తిమ్మసర్తి నాగేశ్వరరావు సూచించారు.

## కేజీబీవీ రీప్లేస్‌మెంట్ ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలి

ప్రకాశం (జర్నలిస్ట్ ఫైల్): ప్రకాశం జిల్లాలో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల (కేజీబీవీ) ఉపాధ్యాయుల రీప్లేస్‌మెంట్ ప్రక్రియను సీనియారిటీ ప్రాతిపదికన పారదర్శకంగా వెంటనే పూర్తి చేసి అర్హులైన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం (టీఎన్‌యూఎస్) డిమాండ్ చేసింది. సంఘం నాయకులు తెలిపిన వివరాల ప్రకారం, మే 1న ప్రారంభమైన కేజీబీవీ రీప్లేస్‌మెంట్ ప్రక్రియకు సంబంధించి మే 28న ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, సీనియారిటీ విషయంలో అనేక లోపాలు ఉన్నాయని ఉపాధ్యాయులు ఫిర్యాదు చేశారు. ఈ అంశంపై జిల్లా కలెక్టర్, సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేయగా, అప్పటి కౌన్సెలింగ్ ప్రక్రియను రద్దు చేసి సీనియారిటీ ఆధారంగా తిరిగి రీప్లేస్‌మెంట్ ఉత్తర్వులు జారీ చేయాలని ఆదేశాలు వెలువడ్డాయని పేర్కొన్నారు. అయితే రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాలు జారై దాదాపు 20 రోజులు గడిచినా ప్రక్రియ పూర్తికాకపోవడంతో కేజీబీవీ ఉపాధ్యాయులు తీవ్ర అనిశ్చితి, ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సంఘం ఆవేదన వ్యక్తం చేసింది. వెంటనే రీప్లేస్‌మెంట్ ప్రక్రియ పూర్తి చేసి అర్హులైన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరింది. అదేవిధంగా, ప్రకాశం జిల్లా సమగ్ర శిక్షలో గత రెండేళ్లుగా సెక్టోరియల్ ఆఫీసర్ పోస్టుల్లో ఐదు ఖాళీలు భర్తీ కాకపోవడంతో విద్యా కార్యక్రమాల పర్యవేక్షణ, అమలుపై ప్రతికూల ప్రభావం పడుతోందని పేర్కొంది. ఈ ఖాళీలను కూడా తక్షణమే భర్తీ చేసి సమగ్ర శిక్ష కార్యక్రమాల అమలును మరింత సమర్థవంతంగా నిర్వహించాలని టీఎన్‌యూఎస్ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు ఆర్రిబోయిన రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి యనమల ఆంజనేయులు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# డిప్లొమా బోర్డు పరీక్షల్లో 991 మార్కులతో ఎన్ఆర్ఐ విద్యార్థి ప్రతిభ



○ ఎన్ఆర్ఐ పాలిటెక్నిక్ విద్యార్థి పాటిపాటి బ్రహ్మంకు రూ.10 వేల నగదు బహుమతి

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** మేడికొండూరు సమీపంలోని ఎన్ఆర్ఐ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థి పాటిపాటి బ్రహ్మం ఎస్‌బీటీఈటీ నిర్వహించిన డిప్లొమా ఫైనల్ ఇయర్ బోర్డు పరీక్షల్లో విశేష ప్రతిభ కనబరిచాడు. మొత్తం 1000 మార్కులకు గాను 991 మార్కులు సాధించి 10 జీపీఏతో ఉత్తమ ఫలితాన్ని నమోదు చేశాడు. అలాగే ఈసెట్ పరీక్షలో రాష్ట్ర స్థాయిలో 300వ ర్యాంకు సాధించి మరోసారి తన ప్రతిభను చాటుకున్నాడు.

విద్యార్థి సాధించిన ఈ అద్భుత విజయాన్ని పురస్కరించుకుని ఎన్ఆర్ఐ పాలిటెక్నిక్ కళాశాల యాజమాన్యం రూ. 10,000 నగదు బహుమతిని అందజేసి ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె. శరత్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి. తిలక్ బాబు, ఏఓ సీతారామయ్య, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డి. సంజయ్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రవి కుమార్, వైస్ ప్రిన్సిపాల్ పి. మనోహర్, డీన్ రవికాంత్ విద్యార్థిని అభినందించారు.

పాటిపాటి బ్రహ్మం కృషి, పట్టుదల ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తాయని వారు పేర్కొన్నారు. విద్యార్థి విజయానికి సహకరించిన తల్లిదండ్రులు, అధ్యాపక బృందాన్ని అభినందిస్తూ, విద్యా ప్రమాణాల పెంపు కోసం ఎన్ఆర్ఐ పాలిటెక్నిక్ కళాశాల నిరంతరం కృషి చేస్తోందని, రాష్ట్ర స్థాయిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం సంస్థకు గర్వకారణమని తెలిపారు.

ఫోటో క్యాప్షన్: డిప్లొమా ఫైనల్ ఇయర్ బోర్డు పరీక్షల్లో 1000కి 991 మార్కులు సాధించి 10 జీపీఏతో ప్రతిభ కనబరిచిన విద్యార్థి పాటిపాటి బ్రహ్మంకు రూ. 10,000 నగదు బహుమతిని అందజేస్తున్న ఎన్ఆర్ఐ పాలిటెక్నిక్ కళాశాల యాజమాన్యం.

# గుంటూరులో కంభంపాటి హరిబాబుకు బీజేపీ నేతల ఘన స్వాగతం



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ఒడిశా గవర్నర్, భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు కంభంపాటి హరిబాబు శనివారం గుంటూరు నగరానికి వచ్చిన సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు ఆధ్వర్యంలో పార్టీ జిల్లా నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా పార్టీ వ్యవహారాలు, సంస్థాగత బలోపేతం, సమకాలీన రాజకీయ అంశాలపై నాయకులు హరిబాబుతో చర్చించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి వైవీఆర్ దొరబాబు, సీనియర్ నాయకులు జమ్మల శ్యామ్ కిషోర్, ఎడ్లపాటి రఘునాథబాబు, జాతీయ స్పైసెస్ బోర్డు డైరెక్టర్ కొత్తూరు వెంకట సుబ్బారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎడ్లపాటి స్వరూపరాణి, నెల్లూరు జిల్లా ఇన్‌చార్జి భీమినేని చంద్రశేఖర్, పల్నాడు జిల్లా కో-ఇన్‌చార్జి ఆవుల నాగేంద్ర యాదవ్, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.వి. సుబ్బారావు, మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి హరి పావని, జిల్లా ప్రధాన కార్యదర్శి బజరంగ్ రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షురాలు విమలాదేవి, పార్టీ నాయకుడు టి.వి. రావు, జిల్లా కార్యదర్శులు నారాయణరెడ్డి, నారదాసు వీరమణి, సురేష్ జైన్, ఆఫీస్ సెక్రటరీ నాగేశ్వరావు పాల్గొన్నారు. బీజేపీ మైనార్టీ నాయకుడు గోల్డ్ ఆరిఫ్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు ధారా అంబేద్కర్, మహిళా మోర్చా అధ్యక్షురాలు రాధా మాధవి, యువమోర్చా అధ్యక్షుడు తుంగా యశ్వంత్, ఉపాధ్యక్షురాలు కొచ్చర్ల శ్రీదుర్గా, మండల అధ్యక్షుడు మల్లాల లక్ష్మణ్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఉద్యోగులకు అందని ద్రాక్ష లా నగదు రహిత వైద్య చికిత్స పథకం



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** ప్రభుత్వం ఉద్యోగులకు కార్పొరేట్ ఆసుపత్రులలో నగదు రహిత వైద్య చికిత్స అందని ద్రాక్ష వలె మారిందని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు పేర్కొన్నారు. ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొందుతూ అకస్మాత్తుగా పౌర గ్రంథాలయ ఉద్యోగి కొలకలూరి కృపానందం మరణించగా సురేష్ బాబు ఆదివారం విజయవాడలోని కృపానందం నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ ఉద్యోగుల జీతాల నుండి ప్రతినెలా ఆరోగ్య భీమా ప్రీమియం ప్రభుత్వం మినహాయిస్తుందని అయినప్పటికీ ఉద్యోగులు అనారోగ్యంతో ఆసుపత్రి పాలైతే హెల్త్ కార్డులు ఉపయోగపడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడలోని రమేష్ ఆసుపత్రిలో పది రోజులకు పైగా చికిత్స పొందిన కృపానందం నుండి ఆసుపత్రి యాజమాన్యం ఖర్చుల కింద పది లక్షలు పైగా వసూలు చేశారని,అయినప్పటికీ ఆయన ప్రాణాలు దక్కలేదని తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. రమేష్ ఆసుపత్రికి ప్రభుత్వ రిఫరల్ హాస్పటల్ ఆస్పత్రుల లిస్టులో ఉన్నప్పటికీ నగదు రహిత చికిత్స ను నిరాకరించి లక్షల రూపాయలు ఎందుకు వసూలు చేశారో అర్థం కావడం లేదని అన్నారు. ఉద్యోగి మరణిస్తే పౌర గ్రంథాలయ సంస్థ అధికారులు మట్టి ఖర్చులు కూడా చెల్లించకపోవడం బాధాకరమన్నారు. ఉద్యోగులు అనారోగ్యంతో ఆసుపత్రులలో చేరితే లక్షల రూపాయలు ఖర్చులతో అప్పులపాలై కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయని తెలిపారు. కృపానందం ఇద్దరు పిల్లలలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగము ఇచ్చి,మెడికల్ రియంబర్స్మెంట్ ద్వారా హాస్పిటల్ లో ఖర్చు అయిన పది లక్షల రూపాయలను తిరిగి కుటుంబ సభ్యులకు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగుల హెల్త్ కార్డుల వ్యవస్థను గాడిన పెట్టేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. కృపానందం కుటుంబ సభ్యులకు అసోసియేషన్ అండగా ఉంటుందని సురేష్ బాబు భరోసా ఇచ్చారు.

# జోనళ్ల వారీగా 'సదరం' స్లాట్ బుకింగ్ : మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

○ వైకల్యంపై స్వీయ ధ్రువీకరణ పత్రం తప్పనిసరి!

○ ఆసుపత్రుల్లో హాజరు నమోదు అనంతరమే పరీక్షలు

○ 8 నుంచి స్లాట్ బుకింగ్

○ 13 నుంచి వైకల్య నిర్ధారణ పరీక్షలు

○ ఏపీ సేవా పోర్టల్ ద్వారా దరఖాస్తుదారుడు నేరుగా స్లాట్ బుకింగ్ చేసుకునే సదుపాయం

○ ఈ అవకాశాన్ని కల్పించడం ఇదే తొలిసారి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** దివ్యాంగుల (విభిన్న ప్రతిభావంతులు) వైకల్య అంచనా, ధ్రువీకరణ ప్రక్రియను మరింత పారదర్శకంగా, స్నేహపూర్వకంగా నిర్వహించేందుకు వీలుగా కీలక సంస్కరణలను అమలుచేయబోతున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. దివ్యాంగులు వ్యయప్రయాసలకు గురికాకుండా ఉండేందుకు వీలుగా రాష్ట్రాన్ని యూనిట్ గా కాకుండా స్లాట్ బుకింగ్ ను జోనల్ స్థాయిలో చేసుకోవడానికి వీలు కల్పించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే స్లాట్ బుకింగ్లో తప్పుడు విధానాన్ని అనుసరించకుండా ఉండేందుకు 'సెల్ఫ్ డిక్లరేషన్ (స్వీయ హామీపత్రం) విధానాన్ని, సదరం కింద వైకల్య పరీక్షలు జరిగేందుకు ముందుగానే ఆన్లైన ద్వారా దివ్యాంగుల తప్పనిసరి హాజరు నమోదు విధానాన్ని ప్రవేశపెట్టబోతున్నట్లు తెలిపారు. ఈ నెల 8 నుంచి 'స్లాటు' బుకింగ్ విధానాన్నిపునరుద్ధరించబోతున్నామని, వీటితోపాటే కీలక మార్పులు అమల్లోనికి వస్తాయని నేడొక ప్రకటనలో తెలిపారు. ఈ విధానంపై వైద్యులు, అధికారులపై పనిఒత్తిడి తగ్గుతుందని, దివ్యాంగులకు ప్రయాణపరంగా వెసులుబాటు ఆర్థిక సమస్యలు తగ్గుతాయని చెప్పారు. ఈనెల 13 నుంచి ఎంపిక చేసిన ఆసుపత్రుల్లో వైకల్య నిర్ధారణ పరీక్షలు జరుగుతాయని చెప్పారు. గడిచిన తొలి త్రైమాసికశీలో 80వేల మంది స్లాట్ బుకింగ్ చేసుకున్నారు. జూలై 8 నుంచి ఆగస్టు చివరి వం-కు స్లాట్ బుకింగ్ అవకాశాన్ని కల్పిస్తారు.

ఈ నేపథ్యంలో అమలులోనికి తేనున్న సంస్కరణలపై దివ్యాంగుల్లో అవగాహన కల్పిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి సత్యకుమార్ ఆదేశించారు. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేవీఎన్ చక్రధర్ బాబు హెచ్ ఓ డి లకు జిల్లా అధికారులకు ఆదేశాలు పంపించారు. సదరం పోర్టల్ లో అవసరమైన మార్పులు కూడా చేస్తున్నారు.

**జోనుల వివరాలు :** ప్రస్తుత విధానంలో దివ్యాంగులు రాష్ట్రంలోని ఏ జిల్లాలోనైనా వైకల్య పరీక్షల కోసం స్లాటుబుకింగ్ చేసుకోవడానికి వీలుంది. ఇకపై ఈ విధానాన్ని జోనల్ స్థాయికి పరిమితంచేశారు. అభ్యర్థులు తమ జిల్లాకు దగ్గర్లోని (జోనల్ ప్రతిపాదికన) జిల్లాల్లో మాత్రమే స్లాట్ బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుంది.

జోన్-1 : శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం

జోన్-2 అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ.

జోన్-3 : పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, పోలవరం

జోన్-4 : గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, మార్కాపురం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు,

జోన్-5: తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, వైఎస్సార్ కడప

జోన్-6 : నంద్యాల, అనంతపురం, కర్నూలు, శ్రీ సత్యసాయి.

**ప్రస్తుత సమస్యలు :** సొంత జిల్లాలో అసెస్‌మెంట్ స్లాట్‌లు అందుబాటులో లేకపోవడంతో పలువురు దరఖాస్తుదారులు దూర జిల్లాల్లో అపాయింట్‌మెంట్లు బుక్ చేసుకోవాల్సి వస్తోంది.

దీని ఫలితంగా సదరం ఐడీలను బదిలీ చేయాలంటూ పదేపదే విజ్ఞప్తులు, పరిపాలనాపరమైన సమస్యలు, అనవసర ప్రయాణ ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

-అభ్యర్థులకు తమ వైకల్య స్వభావంపై స్పష్టత లేకపోవడం వల్ల చాలామంది దరఖాస్తుదారులు సంబంధం లేని వైకల్య కేటగిరీని ఎంపిక చేసుకుంటున్నారు. దీనితో అసెస్‌మెంట్‌లు రద్దవుతూ, పరిమిత స్పెషలిస్ట్ స్లాట్‌లు వృథా అవుతున్నాయి. హాజరు నమోదు వ్యవస్థ లేకపోవడంవల్ల భౌతిక ధృవీకరణలో రకరకాల సమస్యలు తలెత్తుతున్నాయి.

**పరిష్కారానికి కొత్త సంస్కరణలు**

**జోనల్ స్లాట్ బుకింగ్ విధానం :** దరఖాస్తుదారులు తమకు కేటాయించిన జోన్‌లో మాత్రమే అసెస్‌మెంట్ స్లాట్‌లను బుక్ చేసుకోగలిగే విధంగా జోనల్ స్లాట్ బుకింగ్ విధానాన్ని సిద్ధం చేశారు.

దీని ద్వారా అభ్యర్థులు తమ సొంత జిల్లాలో లేదా అదే జోన్‌లోని పొరుగు జిల్లాలో సేవలు పొందవచ్చు. దీనివల్ల స్లాట్‌ల సమాన పంపిణీ, ప్రయాణ భారం తగ్గింపు, దాదాపుగా పరిపాలనాపరమైన సమస్యలు పరిష్కారం అవుతాయి

**తప్పుడు (ఫాల్స్) బుకింగ్ నిరోధానికి సెల్ఫ్ డిక్లరేషన్ :** ప్రతి కొత్త దరఖాస్తుదారుడు స్లాట్ బుక్ చేసుకునే సమయంలో తప్పనిసరిగా స్వీయ ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుంది. వైకల్య కేటగిరీ స్పష్టంగా గుర్తించలేని సందర్భాల్లో, బుకింగ్‌కు ముందు అర్హతగల జనరల్ ఫిజీషియన్ నుంచి ధృవీకరణ పత్రం తప్పనిసరిగా పొందాలి. దీనివల్ల స్లాట్ బుకింగ్ ద్వారా సదరు వైద్యుల వద్దకు పరీక్షల నిమిత్తం వెళ్తారు. దీనివల్ల అందుబాటులో ఉన్న అసెస్‌మెంట్ స్లాట్‌ల వినియోగం మెరుగవుతుంది. సెల్ఫ్ డిక్లరేషన్, డాక్టర్ సర్టిఫికేట్ నమూనాను ఏపీ సేవా, సదరం పోర్టల్ లో అందుబాటులో ఉంచుతున్నారు.

**అసెస్‌మెంట్ క్యాంప్‌లో హాజరు నమోదు తప్పనిసరి :** అమలుకు తగ్గట్లు చర్యలు తీసుకున్నారు. దరఖాస్తుదారులు అసెస్‌మెంట్‌కు ముందు సదరం పోర్టల్‌లో తమ హాజరును నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. హాజరు నమోదుతోనే సదరం ఐడీ యాక్టివేషన్ ముడిపడి ఉంటుంది. దీనివల్ల పారదర్శకత, జవాబుదారీతనం పెరిగి, భౌతిక ధృవీకరణ సులభతరం అవుతుంది.

దరఖాస్తుదారులకు మొదటి సంప్రదింపు కేంద్రంగా ఉన్న సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లకు అవగాహన కల్పిస్తున్నారు.

**సిటిజన్ లాగిన్ ద్వారా నేరుగా కూడా దరఖాస్తు చేసుకోవచ్చు :** కూటమి ప్రభుత్వం సదరం స్లాట్ బుకింగ్ సేవను పూర్తిగా ఉచితంగా అందిస్తోంది. సదరం అసెస్‌మెంట్ స్లాట్ కావాల్సిన వారు తమ సమీప గ్రామ/వార్డు సచివాలయం ద్వారా గానీ, ఆఆ(?)పోర్టల్‌లో సిటిజన్ లాగిన్ సృష్టించుకోవడం ద్వారా ఎలాంటి రుసుము చెల్లించకుండా నేరుగా అపాయింట్‌మెంట్ బుక్ చేసుకోవచ్చు.

సిటిజన్ లాగిన్ సృష్టించేందుకు అవసరమైనవి: ఆధార్ నంబర్, ఇమెయిల్ చిరునామా, మొబైల్ నంబర్.

ఆఆ పోర్టల్‌లో లాగిన్ అయిన తర్వాత లబ్ధిదారులు సదరం సేవల ద్వారా అసెస్‌మెంట్ స్లాట్ బుక్ చేసుకోవడం, వైకల్య ధృవీకరణ పత్రాన్ని డౌన్‌లోడ్ చేసి ప్రింట్ తీసుకోవడం పూర్తిగా ఉచితం.

దరఖాస్తుదారుల సౌలభ్యం కోసం, ప్రభుత్వ వాట్సాప్ 'మన మిత్ర' సేవల ద్వారా జిల్లాల వారీగా, వైకల్య వారీగా సదరం స్లాట్ లభ్యతను తెలుసుకోవచ్చు. **సేవలు ఉచితం** "సేవలు పూర్తిగా ఉచితం. స్లాట్ బుకింగ్ లేదా వైకల్య ధృవీకరణ పత్రాల జారీ కోసం అనధికార మధ్యవర్తులకు లేదా దళారులకు ఎలాంటి డబ్బు చెల్లించవద్దు " అని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేవీఎన్ చక్రధర్ బాబు తెలిపారు

# ఆర్టీసీ జేఏసీ సమావేశంలో 30 డిమాండ్లపై చర్చ

○ ప్రభుత్వంతో చర్చలకు ముందు జేఏసీ నాయకుల సమీక్ష

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** ఏపీపీటీడీ (ఆర్టీసీ) ఉద్యోగ సంఘాల జేఏసీ సోమవారం ప్రభుత్వ అధికారులతో జరగనున్న చర్చల నేపథ్యంలో ఆదివారం కీలక సమీక్షసమావేశం నిర్వహించింది. జేఏసీ కన్వీనర్లు వై. శ్రీనివాసరావు, పలిశెట్టి దామోదరరావు ఆధ్వర్యంలో ఆడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన సమావేశంలో చర్చించాల్సిన ప్రధాన అంశాలతో పాటు ఈ నెల 7, 8 తేదీల నుంచి చేపట్టనున్న రెండో దశ ఆందోళన కార్యక్రమాలపై సమీక్షించారు.

గత నెల 11న జేఏసీ ఇచ్చిన నోటీసు అనంతరం తొలి దశ ఆందోళనలు పూర్తయ్యాయని, రెండో దశలో 'ఆర్టీసీ పరిరక్షణ దినం' పేరుతో ఉద్యోగులు డిమాండ్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతూ ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. ఇదే సమయంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ఆర్టీసీ హౌస్‌లో టీఆర్అండ్‌బీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు, ఆర్టీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బాలసుబ్రహ్మణ్యం, ఇతర ఉన్నతాధికారులతో చర్చలు జరగనున్నట్లు వెల్లడించారు.

ఈ సమావేశంలో ఆర్టీసీని బలోపేతం చేసే చర్యలు, ప్రైవేటు విద్యుత్ బస్సుల ప్రవేశాన్ని నిలిపివేసి ఏపీఎస్ఆర్టీసీ ద్వారానే ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణ చేపట్టడం, 'స్త్రీ శక్తి' వంటి సంక్షేమ పథకాల అమలుకు అవసరమైన మేర బస్సుల సంఖ్యను పెంచడం, ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేసి ఉద్యోగులపై పెరుగుతున్న పనిభారాన్ని తగ్గించడం వంటి అంశాలతో పాటు మెమోరాండంలో పొందుపరిచిన సుమారు 30 డిమాండ్లపై ప్రభుత్వంతో చర్చించాలని నిర్ణయించినట్లు జేఏసీ నాయకులు తెలిపారు.

సమీక్ష సమావేశంలో జేఏసీ కన్వీనర్లు వై. శ్రీనివాసరావు, పలిశెట్టి దామోదరరావుతో పాటు కో-కన్వీనర్లు పి.వి. రమణారెడ్డి, జి.వి. నరసయ్య, సి. హెచ్. సుందరయ్య, కట్టా సుబ్రహ్మణ్యం, ఎస్.వి. శేషగిరిరావు, వై. శ్రీనివాసరావు, కే. సూర్యప్రకాశరావు, డి. మాల్యాద్రి పాల్గొన్నారు.

# పీఆర్సీ కమిటీ, ఐఆర్ ప్రకటించాలి : ఫ్యాప్టో

○ జూలై 14న కలెక్టరేట్ ముట్టడి, నిరసనకు ఫ్యాప్టో పిలుపు




**కర్నూలు(జర్నలిస్ట్ ఫైల్):** 12వ పీఆర్సీ కమిటీని వెంటనే నియమించి, 30 శాతం మధ్యంతర భృతి (ఐఆర్)ప్రకటించాలని డిమాండ్ చేస్తూ జూలై 14న జిల్లా కలెక్టరేట్ ఎదుట ర్యాలీ, నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఫ్యాప్టో ప్రకటించింది. ఈ మేరకు ఆదివారం సాయంత్రం జిల్లా యూటీఎఫ్ కార్యాలయంలో రాష్ట్ర ఫ్యాప్టో కో-చైర్మన్ కాకి ప్రకాశ్‌రావు అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కాకి ప్రకాశ్‌రావు మాట్లాడుతూ, ఎన్నికల ముందు ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటినా ఇప్పటి వరకు పీఆర్సీ కమిటీని నియమించలేదని, ఐఆర్‌పై కూడా ఎలాంటి ప్రకటన చేయలేదని విమర్శించారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్ల ఎదుట నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని ఫ్యాప్టో నిర్ణయించిందని తెలిపారు. జూలై 14 ఉదయం 9 గంటలకు ఉపాధ్యాయులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున కలెక్టరేట్‌కు చేరుకుని నిరసనలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

జిల్లా ఫ్యాప్టో చైర్మన్ ఎం. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ 12వ పీఆర్సీ అమలు, 30 శాతం ఐఆర్ ప్రకటించడం, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయడం, ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్షను రద్దు చేయడం ప్రధాన డిమాండ్లుగా పేర్కొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జి. భాస్కర్ మాట్లాడుతూ అన్ని ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు ఈ నిరసన కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. సమావేశంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు జనార్ధన్, ఏపీటీఎఫ్--257 జిల్లా ప్రధాన కార్యదర్శి ఖాసింజి, ఏపీటీఎఫ్--1938 జిల్లా అధ్యక్షుడు ఇస్మాయిల్, ప్రధానోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణ, డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి భీమన్న మాట్లాడుతూ ఉపాధ్యాయుల ఆర్థిక సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జూలై 14న నిర్వహించే ర్యాలీ, కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నవీన్ పాటిల్, వెంకట్రాముడు, మరియానందం తదితరులు పాల్గొన్నారు.

# కోల్ కతాలో శ్యామప్రసాద్ ముఖర్జీ విగ్రహం ధ్వంసం అత్యంత దుర్మార్గమైన చర్య

○ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** కోల్‌కతాలో జాతీయవాది, మహోన్నత దేశభక్తుడు, భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామప్రసాద్ ముఖర్జీ విగ్రహాన్ని ధ్వంసం చేయడం అత్యంత హేయమైన, ప్రజాస్వామ్య వ్యతిరేక చర్య అని భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తీవ్రంగా ఖండించారు. భారతదేశ సమైక్యత, జాతీయ సమగ్రత కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడి విగ్రహంపై దాడి చేయడం కేవలం ఒక విగ్రహాన్ని ధ్వంసం చేయడం కాదు, దేశభక్తి విలువలపై దాడి చేయడమేనని ఆయన అన్నారు. శ్యాం ప్రసాద్ ముఖర్జీ విగ్రహం ఏర్పాటు కు పశ్చిమబెంగాల్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటే జాతి వ్యతిరేక శక్తులు ఈ ఘాతుకానికి వడిగట్టారని మాధవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు ఈ ఘటనకు పాల్పడిన దుండగులను వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ కుట్ర వెనుక ఉన్నవారిని కూడా చట్టం ముందు నిలబెట్టాలని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని ఆయన కోరారు .విగ్రహాన్ని ఆవిష్కరించే ఏర్పాటు జరుగుతుండగా ఒక రోజు ముందు ఈ దుర్ఘటనకు పాల్పడడం పై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతటి దాడులు, విధ్వంసక చర్యలు జరిగినా డాక్టర్ శ్యామప్రసాద్ ముఖర్జీ ఆశయాలను ఎవరూ చెరపలేరని, ఆయన చూపిన జాతీయవాద మార్గంలో భారతీయ జనతా పార్టీ మరింత దృఢ సంకల్పంతో ముందుకు సాగుతుందని పీవీఎన్ మాధవ్ స్పష్టం చేశారు.

# ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై ఎపి సచివాలయంలో 6 నుండి ప్రత్యేక శిబిరం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)పై ఈనెల 6వ తేదీ నుండి 8వ తేది వరకు సచివాలయ ఉద్యోగుల సౌకర్యార్థం ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నారు. ఈప్రత్యేక శిబిరాన్ని 6వ తేది సోమవారం ఉ. 10.30గం.లకు ఎపి సచివాలయం మూడవ భవనం అప్సా(ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం) హాల్లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్, సాయి కాంత్ వర్మ తదితరులు పాల్గొనున్నారు. ఈ ప్రత్యేక క్యాంపులో ఎన్యుమరేషన్ ఫారాలు ఆన్లైన్ సబ్ మిషన్,కొత్త ఓటర్లు ఎన్రోల్మెంట్, ఓటర్ల జాబితా నుండి చనిపోయిన వారి పేర్లు తొలగింపు,చిరునామా మార్పు తదితర అంశాలపై ఉద్యోగులకు అవగాహన కల్పిస్తారు. కావున ఉద్యోగులు 2002 నాటి ఓటరు వివరాలు,తాజా ఫోటో, ప్రస్తుత ఓటరు గుర్తింపు కార్డు (ఎపిక్ కార్డు)ఆధార్ కార్డు, రెసిడెన్షియల్ అడ్రస్ ప్రూఫ్ వివరాలతో హాజరు కావాల్సి ఉంటుంది.

# రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నిరంతరం కృషి చేస్తున్నారు : మంత్రి సంధ్యారాణి

○ రూ.3 కోట్లతో నిర్మించిన గిరిజన బాలుర పాఠశాల భవనాన్ని ప్రారంభించిన మంత్రి గుమ్మడి సంధ్యారాణి..

○ రూ.6 కోట్ల అదనపు నిధులు ఇస్తామని మంత్రి హామీ..



**వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్):** మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో రూ. 3 కోట్ల వ్యయంతో 12 గదులు, అత్యాధునిక వసతులతో నిర్మించిన ప్రభుత్వ గిరిజన సంక్షేమ వసతి గృహ బాలుర పాఠశాల నూతన భవనాన్ని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వినుకొండకు చేరుకున్న మంత్రికి ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఘన స్వాగతం పలికారు.

పాఠశాల భవన ప్రారంభం అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ.. గత ఐదేళ్ల వైఎస్ జగన్ పాలన విధ్వంసకరంగా సాగిందని, ఆ పరిస్థితుల నుంచి ప్రజలు ఇప్పుడిప్పుడే బయటపడుతున్నారని విమర్శించారు. గత ప్రభుత్వంలో గిరిజన వసతి గృహాలు, పాఠశాలల్లో విద్యార్థులకు కనీస భోజన పాత్రలు, తాగునీటి గ్లాసులు కూడా సరిగా అందుబాటులో లేవని ఆరోపించారు. రాజధాని అంశంలో వైఎస్ జగన్ ప్రజలను గందరగోళానికి గురి చేశారని, ప్రతిపక్ష హోదా కూడా లేని వారు ప్రజా సమస్యల కంటే రాజకీయాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ప్రజలు భయాందోళనలు లేకుండా జీవిస్తున్నారని తెలిపారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో అమరావతి, పోలవరం వంటి కీలక ప్రాజెక్టులకు భారీ నిధులు లభిస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన సన్నబియ్యం భోజనం, యూనిఫాంలు, బూట్లు అందిస్తున్నామని, 'తల్లికి వందనం' పథకం ద్వారా ప్రతి విద్యార్థికి ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతిలో ఉచిత సివిల్స్, గ్రూప్స్ శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశామని, గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో తాగునీరు, మరుగుదొడ్ల ఏర్పాటుకు రూ. 60 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. మహిళల సాధికారత కోసం ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, డ్వాక్రా, మెప్మా రుణాలు అమలు చేస్తున్నామని తెలిపారు.

వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు విద్యాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని మంత్రి కొనియాడారు. ఆయన విజ్ఞప్తి మేరకు బ్రాహ్మణపల్లి గిరిజన బాలుర పాఠశాలకు రక్షణ గోడ, డార్మిటరీ నిర్మాణాల కోసం సభా వేదికపైనే రూ. 6 కోట్ల నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే గిరిజన బాలికల కోసం ప్రత్యేక పాఠశాల ఏర్పాటు అంశాన్ని పరిశీలిస్తామని, బొల్లాపల్లి మండల గిరిజనుల కోసం మరో పాఠశాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని హామీ ఇచ్చారు. గతంలో జీవీ ఆంజనేయులు 'శివశక్తి సేవా సంస్థ' ద్వారా తాగునీటి సదుపాయాలు కల్పించడాన్ని మంత్రి అభినందించారు.

ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎస్సీ, ఎస్టీలు తీవ్రంగా నష్టపోయారని, గిరిజన గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేదని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో పాటు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను కూడా పక్కదారి పట్టించారని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో గంజాయి, గుట్కా విస్తరించాయని, నిరుద్యోగులకు ఉద్యోగాల పేరుతో మోసం చేశారని అన్నారు.

ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం స్వర్ణాంధ్ర దిశగా పయనిస్తోందని, నారా లోకేష్ కృషితో రాష్ట్రానికి భారీ పెట్టుబడులు వచ్చి లక్షలాది ఉద్యోగాలకు మార్గం సుగమమైందని తెలిపారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలతో పాటు పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. అమరావతి, పోలవరం నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయని, విశాఖ ఉక్కు పరిశ్రమ మళ్లీ లాభాల బాట పట్టిందని చెప్పారు. అలాగే పాఠశాలకు రూ. 6 కోట్ల నిధులు మంజూరు చేసిన మంత్రి గుమ్మడి సంధ్యారాణికి నియోజకవర్గ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులు, పలు శాఖల అధికారులు, పోలీసు సిబ్బంది, కూటమి నాయకులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థినులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.

Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467